ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
మంగళవారం 7 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 20 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

## పీవోకేలో మళ్లీ నిరసనలు
### రోడ్డుపైకి వచ్చిన నిరసనకారులు

పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజా కాల్పుల్లో ఒకరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆందోళన కారులను అణిచి వేసేందుకు పాక కఠినంగా వ్యవహరిస్తోంది. తమ డిమాండ్లను నెరవేర్చక పోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది.

**శ్రీనగర్, జులై 6 (సింగిడి):** 2






ఆరు రోజుల పాటు ప్రధాని
## విదేశీ పర్యటన
ఇండోనేషియాకు చేరుకున్న ప్రధాని మోడీ
గగనతలంలో యుద్ధవిమానాల ఎస్కార్ట్ 2

# పోలీస్ అభ్యర్థుల పోరుబాట

**17 వేల ఖాళీలు ఉంటే 7 వేలకే నోటిఫికేషనా.. యువతలో పెరుగుతున్న ఆందోళన**

**పూర్తి స్థాయి రిక్రూట్‌మెంట్ ఉండదా.?... ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ**

*తెలంగాణలో పోలీసు కానిస్టేబుల్ నియామకాల అంశం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయని ఉద్యోగార్థులు చెబుతుండగా, ఇప్పటివరకు ప్రకటించిన భర్తీ ప్రక్రియ మాత్రం సుమారు 7 వేలకే పరిమితమైంది. దీంతో మిగతా అవకాశాలపై స్పష్టమైన ప్రకటన ఎందుకు రావడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.*

(స్టేట్ బ్యూరో, సింగిడి)




పోలీసుల భర్తీ ప్రక్రియలో తొలి అడుగుగా సుమారు 5 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రకటన వెలువడింది. అయితే అందుబాటులో ఉన్న ఖాళీలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువగా ఉందని అప్పట్లోనే అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఆందోళనలతో పెరిగిన సంఖ్య..!**

నిరుద్యోగ యువత, ఉద్యోగ సంఘాలు, వివిధ రాజకీయ పక్షాల నిరసనల తర్వాత పాలకులు మరోసారి స్పందించారు. ఒత్తిడి నేపథ్యంలో అదనంగా 2 వేల అవకాశాలను చేర్చడంతో మొత్తం సంఖ్య సుమారు 7 వేలకు చేరుకుంది.

**17 వేలుంటే... మిగతావి ఎప్పుడు..?**

వాస్తవంగా ఖాళీలు 17 వేలకుపైగా ఉన్నాయని చెబుతున్న వేళ, అందరికీ ఒకేసారి అవకాశం కల్పించేలా పూర్తి స్థాయి ప్రక్రియ ఎందుకు చేపట్టడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన భర్తీపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

**యువతలో పెరుగుతున్న ఆందోళన..!**

ఏళ్లుగా సిద్ధమవుతున్న నిరుద్యోగులు సమగ్ర నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. విడతల వారీగా ఎంపికలు చేపట్టడం వల్ల పోటీ తీవ్రత, వయోపరిమితి, భవిష్యత్ అవకాశాలపై అనిశ్చితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విమర్శలకు దారితీసిన వ్యవహారం..!**

ఈ అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకున్నాయి. అందుబాటులో ఉన్న అన్ని ఖాళీలను ఒకేసారి భర్తీ చేయకుండా ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

**తదుపరి ప్రకటన ఎప్పుడు..?**

మిగిలిన కానిస్టేబుల్ అవకాశాల కోసం మరో ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తారా..? లేక ఇదే విధానాన్ని కొనసాగిస్తారా..? అన్న దానిపై వేలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. పూర్తి స్థాయి భర్తీపై అధికారిక స్పష్టత రావాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది.



పర్యాటక రంగం అభివృద్ధిపై
## సీఎం ఫోకస్
### తారామతి బారాదరి, దుర్గం చెరువును మరింత అభివృద్ధి చేయాలని ఆదేశం

**వికారాబాద్ వీరభద్రస్వామి ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచన**

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిపై తెలంగాణ సర్కారు దృష్టి పెట్టింది. పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి పర్యాటక శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ శాఖ భూములలో.. పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**- హైదరాబాద్, జులై 6 (సింగిడి)** 2

## బండి భగీరథ్ బెయిల్‌పై ముగిసిన వాదనలు
### తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు



పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

**- హైదరాబాద్, జులై 6 (సింగిడి)**

జూన్ 2028 నాటికి
## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి
### కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు

**ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు**
**ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు తాగునీటి భరోసా**
**టన్నెల్, రిజర్వాయర్లు, కాలువల పనులు సమాంతరంగా పూర్తి**
**మూడింతలు పెంచిన సిబ్బంది... ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



*దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఎలిమినేటి మాధవ రెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక కెనాల్ ప్రాజెక్టును జూన్ 2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.* 2

**- హైదరాబాద్, జులై 6 (సింగిడి)**

ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ
## నేటితో పూర్తి కావాలి
### పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించాలి

**బిఎల్‌వోలు సక్రమంగా పనిచేసేలా చూడాలి**
**కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, జులై 6 (సింగిడి)**
ఈ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నాటికి ఎట్టి పరిస్థితులలో పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.




2

ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్
## ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ
### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**సిద్దిపేట కరకపట్లలో రూ.800 కోట్లతో నిర్మించిన**
**దేశంలోనే తొలి 'ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ ప్లాంట్'**
**ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు!**

ఆరోగ్య రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులను అవకాశాలుగా అందిపుచ్చుకునేలా.. తెలంగాణను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. **- హైదరాబాద్, జులై 6 (సింగిడి)** 2



## కాళేశ్వరం పాపం కడుక్కోండి
### అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి

**లక్ష కోట్లు ఎలా, ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలి**
**పేదలకు ఎందుకు ఇళ్లు నిర్మించలేదో చెప్పండి**
**కెసిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి పొంగులేటి** 2

**సిద్దిపేట, జులై 6 (సింగిడి)**
గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు.





ప్రజాసేవే లక్ష్యంగా
## బాధ్యతలు నిర్వహిస్తా
### శాసనమండలిలో ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ కార్యాలయం ప్రారంభం

అంబర్‌పేట్ గ్రేవ్‌యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడి 2

శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా అప్పగించిన బాధ్యతలను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ అన్నారు. సోమవారం శాసనమండలిలో ఆయన ప్రభుత్వ విప్ కార్యాలయాన్ని వేదపండితుల ఆశీర్వచనాల మధ్య ప్రారంభించారు.

**- హైదరాబాద్, జూలై 6(సింగిడి)**

# విశాఖలో 'బే సిటీ'..
### అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు

**అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం**
**విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సమీక్ష**
**ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం**
**విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక**
**6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం**
**మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు**
**51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ**

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**- అమరావతి, జూలై 6(సింగిడి)**


2

అయోధ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా
## కృష్ణమోహన్ నియామకం


2

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ వ్యవహారంలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఆరోపణలు నేపథ్యంలో రాజీనామా చేసిన చంపత్ రాయ్ స్థానంలో ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం జరిగిన అత్యున్నత స్థాయి అత్యవసర సమావేశంలో ట్రస్ట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇక్కడ ఆస్తికర విషయమేంటంటే.. అయోధ్య ఆలయ విరాళాల నిధుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, హుండీ ఆదాయానికి గండి పడుతోందని మొదటిగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది

**- అయోధ్య, జూలై 6(సింగిడి)**

ఏపీలో ఉద్యోగుల
## బదిలీలపై నిషేధం
### మార్గదర్శకాలు విడుదల

రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల్లో లోకల్ కేడర్ నిర్ధారణకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. 28 జిల్లాల్లో మార్కాపురం, పోలవరం జిల్లాలను మినహాయించింది. మొత్తం 6 జోన్లు, 2 మల్టీ జోన్లగా విభజన చేసింది. **- అమరావతి (సింగిడి)** 2

## లోకేశ్.. పెట్టుబడుల వేట


2

**దక్షిణ కొరియా పర్యటన బిజీ.. బిజీ**
**జీగాబ్ హా, సాఫ్ట్-ఈపీఐ సీఈవోతో భేటీ**

దక్షిణ కొరియాలో ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేశ్ రెండో రోజు పర్యటన అత్యంత బిజీగా సాగుతోంది. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ఆయన పలు కీలక భేటీలు నిర్వహించారు. సోమవారం 'షూ ఆల్స్' సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో సమావేశమైన మంత్రి లోకేశ్.. ఏపీలో షూ ఆల్స్ ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

**- సియోల్ (సింగిడి)**

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 7 జులై 2026

# ఆరు రోజుల పాటు ప్రధాని విదేశీ పర్యటన

**న్యూఢిల్లీ, జులై 6 (సింగిడి)**

ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగనతలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పర్యటనకు బయలుదేరారు. జులై 6 నుంచి 11 వరకు కొనసాగనున్న ఈ ఆరు రోజుల పర్యటనలో ఆయా దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు మోదీ. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. అలాగే భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలతోనూ సమావేశం కానున్నారు. పర్యటనకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఓ కీలక ప్రకటన విడుదల చేశారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలు భారత యాక్ట్ ఈస్ట్ పాలసీ, మహాసాగర్ విజన్‌కు మరింత బలం చేకూరుస్తాయని ఆయన తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణంపై భారత్ నిబద్ధతను ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జులై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ప్రధానిగా నరేంద్ర మోదీ నాలుగోసారి ఇండోనేషియాలో పర్యటిస్తున్నారు. జకార్తాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో ప్రధాని మోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించనున్నారు. అనంతరం భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారీ సభలో ప్రసంగించనున్నారు. అలాగే యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న యోగ్యకర్తలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఇండోనేషియా పర్యటన అనంతరం జులై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. అలాగే ఆ దేశ గవర్నర్ జనరల్ సామ్ మోస్టిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓల ఫోరంలో పాల్గొని ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతీయ ప్రవాసులతోనూ ప్రత్యేకంగా సమావేశమవుతారు.ఆస్ట్రేలియాపర్యటన అనంతరం జులై 10, 11 తేదీల్లో న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగనుంది. మరోవైపు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌ను సందర్శిస్తున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ నిలవనున్నారు. ఆక్లాండ్‌లో ప్రధాని లక్సన్‌తో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ద్వైపాక్షిక సహకారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. గత రెండేళ్లలో ఇరు దేశాల మధ్య ముఖ్యంగా వాణిజ్యం, రక్షణ రంగాల్లో నమోదైన పురోగతిని సమీక్షించ నున్నారు. అదే సమయంలో ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు.



## ప్రజాసేవే లక్ష్యంగా బాధ్యతలు నిర్వహిస్తా

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి అజారుద్దీన్‌తో కలిసి హైదరాబాద్ అంబర్‌పేట్‌లోని గ్రేవ్‌యార్డును డాక్టర్ బల్మూరి వెంకట్ పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక మైనారిటీ నాయకులు మాట్లాడుతూ, గత ఏడాది గ్రేవ్‌యార్డును సందర్శించిన బల్మూరి వెంకట్ చొరవతో ప్రహరీ గోడ నిర్మాణం, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు వంటి పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన అభివృద్ధి పనులు కూడా వేగంగా సాగుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, సమాన అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోందన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కరకపట్ల లోని బయోటెక్ పార్క్ ఫేజ్ 3లో రూ.800 కోట్లతో సిరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన దేశంలోనే మొదటి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిశోధన, సాంకేతికత, ఏఐ, అధునాతన తయారీ, నైపుణ్యాభివృద్ధిని సమన్వయం చేస్తూ.. భవిష్యత్తులో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పారిశ్రామిక ప్రగతిలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. జహీరాబాద్ నిమ్జ్‌ను మోడల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఫార్మా అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని వెల్లడించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని.. పర్యావరణహిత పద్ధతుల్లో ఔషధాలను ఉత్పత్తి చేసేలా పరిశ్రమలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్–2047, నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ద్వారా పరిశోధన నుంచి ఉత్పత్తి వరకు అన్ని దశలను అనుసంధానించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బయోలాజిక్స్, బయోసిమిలర్స్, సెల్ అండ్ జీన్ థెరపీలు, ఏఐ, డిజిటల్ హెల్త్ తదితర అత్యాధునిక రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ ప్లాంట్‌లో అత్యాధునిక కంటైన్‌మెంట్ టెక్నాలజీని ఉపయోగించి.. క్యాన్సర్ నివారణకు సంబంధించిన ఓరల్ ఆంకాలజీ ఔషధాలు, స్టెరిలైజ్ ఇంజెక్టబుల్స్, లైయోఫిలైజ్డ్ పౌడర్ ఇంజెక్షన్లు, సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌ను ఉత్పత్తి చేస్తారన్నారు. కొత్తగా 500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు డా.గోవింద రెడ్డి, డా.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని కోర్టులో పేట్ బషీరాబాద్ పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. నిందితుడిపై బాలిక తల్లి ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశాక ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో అభియోగాలను సవరించినట్లు పోలీసులు చెప్పారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం చేసుకుని, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. బండి భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రి కాబట్టి కేసుపై ప్రభావం చూపుతోందని బాధితురాలి తరపు న్యాయవాది వాదించారు. దర్యాప్తు దశలో బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. ఇంకా ఈ కేసులో సాక్షులను విచారణ చేయాల్సి ఉందని.. బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులు స్టేట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బండి భగీరథ్ జైల్లో ఉన్నప్పుడే కేసు విచారణ పారదర్శకంగా జరుగుతుందని కోర్టులో బాధితురాలి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ నేటితో పూర్తి కావాలి

ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పట్టణ ప్రాంతం కలెక్టర్లు దీనిపై శ్రద్ధవహించి వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర్లు తో కలిసి సోమవారం ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమ పురోగతిపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సూపర్ వైజర్ల ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఎక్కడైతే బిఎల్ఒలు బలహీనంగా ఉన్నారో వారిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో వారికి సూపర్ వైజర్లు సహకరించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో స్థానికంగా వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని సూచించారు. సంబంధిత సూపర్ వైజర్ల ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హైదరబాద్లో ఇప్పటికే ప్రారంభమైన 16 హెల్ప్ డెస్క్ లతో పాటు అవసరమైన చోట అదనంగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. పూర్తయిన ఎన్యూమరేషన్ ఫారాలలో సదరు ఓటరు, బిఎల్ఒ సంతకాలు ఉండేలా చూడాలని దీంతో పాటు ఫోటోలు ఉండేలా చూడాలని సిఇఒ ఆదేశించారు. ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ పక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి డిజిటలైజేషన్ పక్రియను ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పక్రియను కూడా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వివిధ పోలింగ్ కేంద్రాలలో కాకుండా ఒకే పోలింగ్ కేంద్రంలో వారి పేర్లు ఉండేవిధంగా చూడాలన్నారు. ఆన్ లైన్ ద్వారా వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బిఎల్ఒలు సరి చూసుకోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో మరోసారి బిఎల్ఒలకు, సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను సిఇఒ ఆదేశించారు. బిఎల్ఒలు తప్పనిసరిగా రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిగేవిధంగా చూడాలని, సర్ పక్రియపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఇఒ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విశాఖలో 'బే సిటీ'..

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను తలదన్నేలా, లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు.

**ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

**'వైజాగ్ బే సిటీ'.. పర్యాటక సర్క్యూట్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్–ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్–ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు–పాడేరు–విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని, సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**అమరావతి, తిరుపతి రీజియన్ల అభివృద్ధి**

రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు

## కాళేశ్వరం పాపం కడుక్కోండి

కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రపంచంలో ఉన్న ఏడు వింతలు కాదని.. ఎనిమిదో వింత కాళేశ్వరమని ఆనాడు చెప్పిన పెద్దమనిషి అసెంబ్లీకి రావాలని సూచించారు. కాళేశ్వరం ఎలా కట్టారో చెప్పాలని, కేసీఆర్ తెలంగాణకు చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అసంపూర్తిగా కట్టి మధ్యలోనే వదిలేశారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వదిలేసిన ఆ అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్నింటినీ రిపేర్ చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తల తాకట్టు పెట్టి అయినా సరే, అర్హులైన ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 32 వేల పూరి గుడిసెలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మొదటి విడతలో ఇవ్వలేక పోయిన వాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇస్తామని.. వారికే మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఏ పార్టీల్లోని లబ్దిదారులైనా.. పైరవీ లేకుండా చిత్తశుద్ధితో ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట గజ్వేల్, సిరిసిల్ల, నియోజకవర్గాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అత్యధికంగా కట్టుకున్నారని చెప్పారు. వేరే నియోజకవర్గాల్లో అరకొరగా 50, 60 ఇళ్లు కట్టి అసంపూర్తిగానే వదిలేశారని తెలిపారు. రెండోవిడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వ్యాఖ్యానించారు. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా డబ్బులు ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయించామని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## లోకేశ్.. పెట్టుబడుల వేట

గతంలో కుదిరిన ఎంవోయూ ప్రకారం రాష్ట్రంలో పాదరక్షల యూనిట్ పనులను మరింత వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత షోలమ్ గ్రూప్ ఆఫీసర్ జీగాబ్ హో, సాఫ్ట్–ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్‌లతో ఆయన భేటీ అయ్యారు. శ్రీసిటీలో యూనిట్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రూ.338 కోట్లతో షోలమ్ సంస్థ ఈవీ ఛార్జర్ పవర్ మాడ్యూల్స్ నిర్మించాలని వెల్లడించారు. ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. తిరుపతి ఐఐటీ సహకారంతో ఈపీఐ అకాడమీని ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కొరియా ప్రతినిధులు తెలిపినట్లు సమాచారం.

**భారత రాయబారితో భేటీ..**

అంతకుముందు ఆదివారం సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా.. శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కె వంటి కొరియన్ ఎలక్ట్రానిక్స్, చిప్స్ దిగ్గజాలను ఏపీకి రప్పించేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పెట్టుబడి అనుకూలతలను రాయబారికి వివరించారు. 'శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలో మౌలిక వసతులతో కూడిన క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయి. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర యూనివర్సిటీల ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందిస్తున్నాం. దక్షిణ కొరియా చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి చేసిన ప్రతిపాదన మేరకు శ్రీసిటీలో 'కొరియా ఎన్‌క్లేవ్' కోసం ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు.




## జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. న్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే పక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి' అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్–ఇన్–చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అయోధ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్ నియామకం

కృష్ణమోహనే. ఆయన ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగానే అయోధ్య పోలీసులు, సిట్ అధికారులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాయి. విరాళాల దొంగతనాన్ని బయటపెట్టడంలో కీలక పాత్ర పోషించిన ఆయనకే ఇప్పుడు ట్రస్ట్ తాత్కాలికంగా అత్యున్నత పరిపాలనా బాధ్యతలను అప్పగించడం విశేషం. పూర్తి స్థాయి దర్యాప్తు ముగిసి, కొత్త శాశ్వత కార్యదర్శిని ఎన్నుకునే వరకు కృష్ణమోహన్ ఈ పదవిలో కొనసాగనున్నారు.

## ఏపీలో ఉద్యోగుల బదిలీలపై నిషేధం

ఈ రెండు జోన్లను మరో మూడేసిగా విభజించింది. మల్టీ జోన్లు, జోన్ల ప్రకారం ఉద్యోగుల కేడర్ విభజన చేయాలని ప్రభుత్వం భావించింది. కొత్త జిల్లాల్లో పరిస్థితి దృష్ట్యా పోస్టులు అలాట్మెంట్లపై మార్గదర్శకాలు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ స్థాయి ఉద్యోగులను మల్టీ జోన్లకు కేటాయించింది. స్థానిక కేడర్ నిర్ధారణ అయ్యే వరకూ బదిలీలపై కూడా నిషేధాన్ని విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి ప్రమోషన్లు ఉండవని స్పష్టం చేసింది. జులై 5 వరకూ సెట్టింగ్స్ చేసుకుంది. ఇక ఈ బదిలీల నిషేధం అనేది ఎప్పటివరకూ అనే తేదీని త్వరలోనే ప్రకటించనుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటైన నేపథ్యంలో ''స్థానిక కేడర్ ఉద్యోగులు ఎక్కడ పని చేయాలి, జిల్లాల్లో అదనంగా ఉద్యోగుల ఉంటే ఎలా సర్దుబాటు చేయాలి. ప్రమోషన్లకు సంబంధించిన నిర్ణయాన్ని కూడా ఎలా తీసుకోవాలి ''అనే అంశాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ఆధారంగా ఉద్యోగుల కేడర్ నియామకం జరుగుతుంది. ఈ నియామకాల తర్వాతే బదిలీలు, ప్రమోషన్లు, డిప్యూటేషన్లపై ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు, లోక్ భవన్, అసెంబ్లీలో పని చేసే అధికారులు, ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చింది. మొత్తం 26 జిల్లాల్లో 2025 ఉత్తర్వుల ప్రకారం ఈ కేడర్ నియామకం జరగనుంది. ఈ నియామకాల తర్వాత బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 6 జోన్లలో ఉద్యోగుల విభజన జరగాలనే డీటేయిల్డ్ ఉత్తర్వులను ప్రభుత్వం త్వరలోనే జారీ చేసే అవకాశం ఉంది.

## పర్యాటక రంగం అభివృద్ధిపై సీఎం ఫోకస్

ఫ్యూచర్ సిటీ పరిధిలో ఉన్న అటవీ భూములను అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలోనే నగరంలో ఎకో పార్కులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

## పీవోకేలో మళ్లీ నిరసనలు

తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను కోరింది. పాక ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏఏసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమకు ఇతర మార్గాలు ఉన్నాయని పాక ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది. కాగా.. జేఏఏసీ నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరత ఉంది. మానవతా సాయం అందించండి' అని ఆయన కోరినట్టుగా ఆ వీడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక.. ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిదని అందులో ఆరోపించారు. పరిస్థితులు మరింత దిగజారితే పౌరులు భారత్‌కు వచ్చేందుకు వీలుగా నియంత్రణ రేఖ వెంట సరిహద్దును తెరవాలని అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. గత కొన్నిరోజులుగా పీఓకేలో పాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆందోళనలకు మద్దతు ఇస్తున్న జేఏఏసీని పాక ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. ఈ కమిటీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీఓకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది.







నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్థాపించబడిన కేఎం. పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులకు విద్యను అందిస్తూ, జాబ్ మేళాల ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో ప్రశంసనీయమని అన్నారు.

### బొట్టు బొట్టు నీరు అంతిమంగా నదిగా మారినట్టు

# చిన్న ఉద్యోగంతో మొదలై.. ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్, జూలై 6 (సింగిడి):** యువతకు ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పనలో "కేఎం. పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల" చేస్తున్న సేవలు అభినందనీయం. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బహదూర్‌పల్లిలో ఉన్న "కేఎం. పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల" వేదికగా ఇంటర్మీడియట్ వోకేషనల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బొట్టు, బొట్టు నీరు అంతిమంగా నదిగా మారినట్టు, చిన్న ఉద్యోగంతో మొదలై మీరు అంతిమంగా ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్థాపించబడిన కేఎం. పాండు మెమోరియల్ వోకేషనల్ జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులకు విద్యను అందిస్తూ, జాబ్ మేళాల ద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో ప్రశంసనీయమని అన్నారు.ప్రభుత్వ వోకేషనల్ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న జేఈటీఎల్, ఏవీ రావు పవనపుత్ర ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు ఈ కార్యక్రమానికి సహకరించిన అన్ని సంస్థలు, దాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువత పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకుని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు యువత భవిష్యత్తుకు బలమైన పునాదిని, మనోధైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 30 కంపెనీలు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. అనంతరం ఎం.ఎస్.ఎన్ ల్యాబోరేటరీస్ ల లో నియామకం అయిన నలుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ కుషాన్, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ జాయింట్ సెక్రటరీ జోష్నా, ఆర్డిఎస్ఐఈ ఏడి ఉషేంద్ర, కుత్బుల్లాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, మల్కాజ్గిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా, కూకట్పల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, దాతలు బి. సాయి కుమార్, ఏవి.రావు, వెలుగు ట్రస్ట్ ఫౌండర్ నారాయణ రావు, మాజీ కౌన్సిలర్లు ఎలుగారి సత్యనారాయణ, భరత్, మాజీ సర్పంచ్ కొమురయ్య యాదవ్, సగ్గడి పద్మారావు, నాయకులు సగ్గిడి శ్రీనివాస్, నాయి కోటి శ్యామ్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండండి..





ప్రతి ఓటు అత్యంత కీలకం

ఓటర్లకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలం

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, జూలై 06 (సింగిడి):** కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంలో ఓటర్లకు అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని.. అర్హులైన ఓటరు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి.. అర్హులైన ప్రతి ఓటు ఎస్ఐఆర్లో నమోదు చేయించాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ అంశాలపై బిఎల్ఏలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 12 న పటాన్చెరు లోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీష్ రావు ముఖ్య అతిథిగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మినీ ఇండియాగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించక పోవడం మూలంగా ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. దేశంలోని 28 రాష్ట్రాల ప్రజలు నియోజక వర్గంలో నివాసం ఏర్పరచుకొని తమ జీవనాన్ని కొనసాగి స్తున్నారని.. వీరి ఓటు హక్కు అంశం ప్రశ్నార్థకంగా మారుతుం దని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నియమించిన బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆశించిన మేరకు పనిచేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ తరఫున నియమించబడిన బూతు లెవెల్ ఏజెంట్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఓటరుకి ఎస్ఐఆర్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి.. తమ వివరాలు నమోదు చేయించుకునేలా కృషి చేయాలని సూచించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో బిఆర్ఎస్ ఓట్లను తొలగించాలన్న కుట్రతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నియోజకవర్గంలో 70 వేల ఓట్లు తొలగించి.. ఆమెను ఓడించారని గుర్తు చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిది డివిజన్లో ఉన్నాయని.. రాబోయే బల్దియా ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలంటే ప్రతి ఓటును రక్షించుకోవాల్సిన ఆవశ్యకత కార్యకర్తలపై ఉందని తెలిపారు..రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్లకు స్థానికంగానే ఓటు ఉంచుకునేలా సూచించాలని కోరారు. ఈ అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 12వ తేదీన పటాన్చెరులో మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఏలు భారీ సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పరామర్శించిన హరీష్ రావు

**కుత్బుల్లాపూర్, జూలై 6 (సింగిడి):** వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ఆదివారం మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను శంభీపూర్ లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి హరీష్ రావు మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు.



## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

### సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన హనుమంత రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూలై 6 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 273వ డివిజన్ నిజాంపేట్ కొలన్ నారాయణ రెడ్డి కాలనీలో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, వారు వెంటనే స్పందించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిధుల ద్వారా రూ.65 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించారు. సోమవారం మంజూరైన సిసి రోడ్ల పనులు ప్రారంభోత్సవానికి కొలను హనుమంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు ఆయనకు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాలనీలోని పలు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి, ప్రజలు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అవసరమైన అభివృద్ధి పనులను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కోట మురళి, బాచుపల్లి అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, మౌళేశ్వర్ రావు, ఇందిరా కడియాల, అసోసియేషన్ సభ్యులు రమణ రెడ్డి, చిర్ర శ్రీనివాస్ రెడ్డి, జె. నాగి రెడ్డి, కొలన్ మాణిక్ రెడ్డి, కొలన్ వెంకట్ రెడ్డి, నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి, వర్మ రాజు, మామిడ్ల శ్రీనివాస్, గిరిధార్, సత్య ప్రసాద్, విజయ్, జైపాల్ రెడ్డి, కోటి రెడ్డి, ఉపేందర్, క్రిష్ణ రెడ్డి, కొలన్ క్రిష్ణ రెడ్డి, కైలాష్, సత్యనారాయణ, అంజి రెడ్డి, పి. శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఫెన్సింగ్‌లో చిక్కుకున్న జింకకు ప్రాణదానం

### ఎన్కేపల్లి గ్రామస్తుల అప్రమత్తతతో సురక్షితం

**వికారాబాద్, జూలై 6(సింగిడి):** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం ఎన్కేపల్లి గ్రామ పరిధిలో పంట పొలానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లలో చిక్కుకుని కదలలేని స్థితిలో ఉన్న ఓ జింకను గమనించిన గ్రామస్తులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో స్పందించి వారు ప్రాణాపాయం నుంచి కాపాడారు. గ్రామ శివారులోని పంట పొలానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లలో జింక కాలు చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, అటుగా వెళ్లిన స్థానికులు గమనించి వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అత్యంత జాగ్రత్తగా ఫెన్సింగ్ వైర్ల నుంచి జింకను విడిపించారు. అనంతరం జింకకు ప్రాథమిక చికిత్స అందించి, తదుపరి వైద్య పరీక్షలు మరియు సంరక్షణ కోసం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. గ్రామస్తుల అప్రమత్తత, అటవీ శాఖ అధికారుల వేగవంతమైన చర్యల వల్ల మూగజీవి ప్రాణాలు దక్కాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఇనాయత్ అలీ మాట్లాడుతూ అడవి జంతువులు ఆహారం, నీటి కోసం గ్రామాల సమీపంలోని వ్యవసాయ పొలాల వైపు వస్తున్న నేపథ్యంలో రైతులు ఏర్పాటు చేసే ఫెన్సింగ్ వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. అడవి జంతువులు కనిపించినప్పుడు వాటికి ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్..

**పటాన్చెరు, జూలై 06 (సింగిడి):** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నేపల్లి పర్యటనలో గాయ పడిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. సోమ వారం ఉదయం శంభీపూర్ లోని ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి కృపతో త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి రావాలని అభిలాషించారు.



## అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం

**దుబ్బాక, జూలై 6 (సింగిడి):** మండలంలోని గంభీర్పూర్ గ్రామం-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి, రిలయన్స్ ప్రతినిధి భాస్కర్, గ్రామ సర్పంచ్ బాణాల సునంద శ్రీనివాస్, ఉపసర్పంచ్ బైండ్ల బాలరాజు, గ్రామ కార్యదర్శి మల్లారెడ్డి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించే విధానం, సమతుల్య పౌష్టికాహారం ప్రాముఖ్యత, పిల్లల శారీరక మానసిక వికాసంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.



## దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనానికి పూర్తిస్థాయిలో తరలింపు

**దుబ్బాక, జూలై 6 (సింగిడి):** దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయిలో నూతన భవనానికి తరలిం చినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని తెలిపారు. ఇప్పటి వరకు టీటీడీ కళ్యాణ మండపం సమీపంలోని పాత భవనంలో కొనసాగిన కళాశాల తరగతులు, పరిపాలనా కార్యకలాపాలు ఇకపై కెసిఆర్ స్కూల్ భవనంలో ఏర్పాటు చేసిన నూతన కళాశాల భవనంలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఈ తరలింపు ప్రక్రియ పూర్తయిందని ఆమె పేర్కొన్నారు. ఇకపై కళాశాలకు సంబంధించిన అన్ని విద్యా, పరిపాలనా కార్యకలాపాలతో పాటు దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు కూడా నూతన భవనంలోనే నిర్వహించబడతాయని తెలిపారు. డిగ్రీలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నూతన కళాశాల భవనానికి వచ్చి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. విశాలమైన తరగతి గదులు, మెరుగైన మౌలిక వసతులు, అనుకూలమైన విద్యా వాతావరణం నూతన భవనంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా ప్రవేశాలు పొందుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.



## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు కీలకపాత్ర పోషించాలి

### ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్, జూలై 6 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 130 - సుభాష్ నగర్ డివిజన్ జై శ్రీరామ్ నగర్ కు చెందిన నూతన సంక్షేమ సంఘం నాయకులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు కీలక పాత్ర పోషించాలని, కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజు, మైసగౌడ్, కిశోర్ ముదిరాజ్, జై శ్రీరామ్ నగర్ ప్రెసిడెంట్ వేణు ముదిరాజ్, జనరల్ సెక్రెటరీ అనిల్ కుమార్, ట్రెజరర్ సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సుధీర్, రాసయ్య, బస్వరాజ్, శివాజీ, రామకృష్ణ, కృష్ణ ముదిరాజ్, యాదుల్, మనోజ్, పాస్టర్ నాని, ప్రసాద్, హరి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



## దళిత కుటుంబాల వేధింపులు

### కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి



**ఆమనగల్లు, జూలై 06(సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీలోని నవచైతన్య కాలనీలోని ఎల్లమ్మ దేవస్థాన భూమిని కబ్జా చేసేందుకు కొల్లూరు కృష్ణా దేవి ప్రయత్నిస్తూ, 12 దళిత కుటుంబాలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తోంది. ఈ అన్యాయాన్ని నిరసిస్తూ బాధితులు సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. దేవాలయ భూమిని కాపాడి తమకు న్యాయం చేయాలని కోరారు. దళితుల ఆవేదనను ఎమ్మెల్యే పరిశీలించి, తక్షణమే కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వస్పుల జంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు జంతుక జానయ్య, జంతుక శంకర్, బలరాం, అశోక్, కృష్ణ, చిన్న, వగ్గు జంగయ్య, రాజు, జంగయ్య, శివ పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, జూలై 6 (సింగిడి):** ప్రజావాణి కార్యక్రమంలో అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించడానికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి వివరాలను తెలుసుకుని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వినతులను అందజేసి తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 66 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 35, సంగారెడ్డి డివిజన్‌లో 13, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 6, జహీరాబాద్ డివిజన్‌లో 12 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య భద్రతే ముఖ్యం

### ట్రాఫిక్ ఏసిపి సుబ్బయ్య



**జవహర్ నగర్, జూలై 6 (సింగిడి):** ప్రజా వ్యవస్థలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని విధి నిర్వహణలో సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వారి భద్రత కోసం కృషి చేస్తున్నామని ట్రాఫిక్ ఏసిపి సుబ్బయ్య అన్నారు. ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఆదేశాల మేరకు జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో రెటినోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకర హాస్పటల్ సహకారంతో ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ సమక్షంలో ఉచిత వైద్య శిబిర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ఆధునిక కాలంలో రకరకాల రోగాలు ప్రజ లను వెంటాడుతున్నాయని పోలీసులు శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలిగేందుకు యోగాను దినచర్య లో భాగం చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు యోగ వైపు పయనిస్తుందని, యోగాభ్యాసంతోనే సర్వ రోగాలను నయం చేసుకోవచ్చు అన్నారు. భారత ప్రభుత్వం యోగ విద్యకు పెద్దపీట వేస్తుం దని తెలిపారు. 50 మంది పోలీసులకు వైద్య సిబ్బంది పరీక్ష లు నిర్వహించారు.

# ఎడిటోరియల్

Editorial

## దేశానికిమూడు సంక్షోభాల ముప్పు...

### పెట్టుబడిదారీ విధాన వైఫల్యాల ప్రతిబింబం!

భారత ఆర్థికవ్యవస్థ మరోసారి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పెరుగు తున్న ముడి చమురు ధరలు... "సూపర్ ఎల్‌నినో" ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులు... అసాధారణ వడగాల్పులు, బలహీనమైన వర్షపాతం... ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభం వైపు నెడుతు న్నాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ సంక్షోభాలను కేవలం ప్రకృతి వైపరీత్యాలుగా లేదా అంతర్జాతీయ పరిణామాలుగా మాత్రమే చూడటం సరైంది కాదు. ఇవి అసలు పెట్టుబడిదారీ విధానం నిర్మించిన అసమాన ఆర్థిక నిర్మాణాల ఫలితం.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇప్పటికీ చౌకైన ఇంధనం, వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన రుతుపవనాలపై ఆధారపడి ఉన్నాయి. కానీ గత మూడు దశాబ్దాలుగా అమలవుతున్న నూతన ఆర్థిక విధానాలు ఈ పునాదులను బలహీనపరిచాయి. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ ఆధారిత అభి వృద్ధి నమూనాను ప్రోత్సహించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ మార్కెట్ కుదుపులకు బానిసగా మారింది. హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలకమైన ఈ మార్గంలో చిన్న అంతరాయం వచ్చినా దాని ప్రభావం భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలపై తీవ్రంగా పడుతుంది. ఇది కేవలం మార్కెట్ సమస్య కాదు; ప్రపంచ సామ్రాజ్యవాద శక్తుల మధ్య ఆధిపత్య పోరాటాల ఫలితం. అమెరికా, నాటో శక్తులు, పశ్చిమ దేశాల భౌగోళిక రాజకీయ జోక్యాలు ప్రపంచ ఇంధన మార్కెట్లను అస్థిరం చేస్తున్నాయి. కానీ ఆ భారాన్ని మోసేది మాత్రం సాధారణ ప్రజలే. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాంతో కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అన్నీ ఖరీదవుతాయి. చివరకు ద్రవ్యోల్బణం రూపంలో ప్రజల జేబులు ఖాళీ అవుతాయి.

**ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే ..**

దేశం ఎందుకు ఇంకా విదేశీ చమురు దిగుమతులపైనే ఆధారపడుతోంది? ప్రత్యామ్నాయ ఇంధన రంగాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వాలు ఎందుకు విఫలమయ్యాయి? దీనికి సమాధానం స్పష్టమే. కార్పొరేట్ చమురు కంపెనీల లాభాల కోసం ప్రభుత్వ విధానాలు నడుస్తున్నాయి. ప్రజల అవసరాల కంటే మార్కెట్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ఇలాంటి సంక్షోభాలను మరింత పెంచుతోంది. "సూపర్ ఎల్‌నినో" ప్రభావం, తీవ్ర వడగాల్పులు, వర్షాభావం వంటి పరిణామాలు ఇప్పుడు సాధారణ వాతావరణ మార్పులు కాదు. ఇవి ప్రపంచ పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనా సృష్టించిన పర్యావరణ సంక్షోభాల ప్రతిఫలాలు. నిరంతర పారిశ్రామికీకరణ, అడవుల నరికివేత, బొగ్గు–చమురు ఆధారిత పరిశ్రమల విస్తరణ, ప్రకృతి వనరుల దోపిడీ – ఇవన్నీ కలిసి భూమి వాతావరణ సమతుల్యతను ధ్వంసం చేశాయి. భారతదేశంలో దీని ప్రభావం అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఇంకా కోట్లాది మంది రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తు న్నారు. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బతింటాయి. పంటలు దెబ్బతింటే రైతు ఆదాయం కూలిపోతుంది. గ్రామీణ కొనుగోలు శక్తి పడిపోతుంది. దాని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై పడుతుంది.

**కానీ ప్రభుత్వాల ప్రాధాన్యత ఏమిటి?**

రైతుకు కనీస మద్దతు ధర ఇవ్వడంలో వెనుకంజ... సాగునీటి విస్తరణలో నిర్లక్ష్యం... వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి నెట్టే చట్టాలు... ఇవన్నీ వ్యవసాయ రంగాన్ని మరింత బలహీనపరుస్తున్నాయి. వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రభుత్వాలే నాశనం చేస్తున్నాయి. చమురు ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం కలిసి ఆహార ద్రవ్యోల్బ ణాన్ని పెంచుతున్నాయి. ఇప్పటికే సామాన్య ప్రజలు కూరగాయలు, పప్పులు, వంటనూనెల ధరలతో సతమతమవుతున్నారు. మధ్యతరగతి కుటుంబాలు నెలాఖరుకి చేతులు ఎత్తేస్తున్నాయి. కార్మికులు, చిన్న ఉద్యోగులు, కూలీలు జీవన వ్యయ భారం తట్టుకోలేకపోతున్నారు. అయితే ప్రభుత్వం తీసుకునే చర్యలు ఏమిటి? కార్పొరేట్ పన్నుల తగ్గింపు, ప్రైవేటీకరణ, ప్రజా రంగ సంస్థల అమ్మకాలు. ద్రవ్యోల్బణం పెరిగినా వేతనాలు పెరగడం లేదు. ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ఇది సాధారణ ఆర్థిక మందగమనం కాదు; ఇది సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి ప్రజల అవసరాల కోసం కాదు, లాభాల కోసం జరుగుతుంది. అందుకే ధాన్యం గోదాముల్లో పాడైపోతున్నా పేదవాడు ఆకలితో అలమటిస్తాడు. రైతు నష్టాల్లో మునిగిపోతున్నా కార్పొరేట్ అగ్రి కంపెనీలు లాభాలు ఆర్జిస్తాయి. చమురు ధరలు పెరిగితే సామాన్యుడు ఇబ్బంది పడతాడు కానీ పెద్ద కంపెనీలు మాత్రం మరింత లాభాలు చూస్తాయి.

**పరిష్కారం ఏమిటి?**

ఈ సంక్షోభాలకు తాత్కాలిక ఉపశమనాలు సరిపోవు. వ్యవస్థాత్మక మార్పులు అవసరం. ప్రజా అవసరాల ఆధారంగా ఆర్థిక విధానాలు రూపొందాలి. వ్యవసాయానికి భారీ పెట్టుబడులు పెట్టాలి. ప్రజా రవాణా, ప్రత్యామ్నాయ ఇంధన రంగాలను ప్రభుత్వ ఆధీనంలో బలోపేతం చేయాలి. కార్పొరేట్ దోపిడీని నియంత్రించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించాలి. ఉపాధి, కనీస వేతన హామీలను పెంచాలి. అత్యంత ముఖ్యంగా – ప్రకృతి వనరులను లాభాల సాధనంగా కాకుండా ప్రజల సామూహిక ఆస్తిగా చూడాల్సిన దృక్పథం అవసరం. మార్కెట్ ఆధారిత అభివృద్ధి కాదు, మానవ అవసరాల ఆధారిత అభివృద్ధే సమాజాన్ని కాపాడగలదు. ఈ మూడు సంక్షోభాలు మనకు ఒక గాఢమైన హెచ్చరిక ఇస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానం మనిషిని మాత్రమే కాదు, ప్రకృతినీ సంక్షోభంలోకి నెడుతోంది. ప్రజల శ్రమతో సృష్టించిన సంపదను కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకరించే ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయం గురించి దేశం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

## తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న

# దాడిని వ్యతిరేకిద్దాం...!







**తొలి దశ మలిదశ ఉద్యమం తెలంగాణ చరిత్రలో అక్షాలే కాదు ఏ వస్తువును తట్టిన చెట్టు పుట్టను కదిలించిన కొలిమిలో ఎగిసి పడే నిప్పు రవ్వల ఉద్యమ పోరాట పటిమను తెలుపుతుంది. ఈ నేలపై ఒక రాణి రుద్రమదేవి, చాకలి ఐలమ్మ, బెల్లి లలిత వంటి వీర నారీలు తమ గళాలతో గర్జిస్తూ శత్రువుల గుండెలో గుబులు పుట్టించి తెలంగాణ బాగు కోసం యుద్ధ భూమిలో పోరాటం సల్పిరూ, నిజాం సర్కార్ అయితేనేమి ఆంధ్ర పాలకులు అయితేనేమి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తూ పైచాసిక ఆనందంతో తెలంగాణ సంపద, నిధులు, నియమాలు దోచుకుంటుంటే రక్తం మరిగిన ప్రాంతీయ ఉద్యమ కార్యకర్తలు పౌరుషముతో పిడికిళ్లు ఎక్కుపెట్టి జై తెలంగాణ అని గర్జిస్తూ ఇదిరా నా తెలంగాణ పౌరుషం అంటూ పోరాటానికి శంఖారావం పూరించారు.**

తొలిదశ ఉద్యమంలో తుపాకి గుండ్లకు రొమ్ము చార్చి దున్నేవాడిదే భూమి అంటూ నిజాం నిరంకు శత్వంపై తిరుగబావుటా ఎగురవేసి సగర్వంగా ధీరత్వం చూపిన పోరాటాల గడ్డ ఇది. ఆనాటి ఆంధ్ర పాలకులు తీసుకు వచ్చిన సంస్కరణలలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని భావించిన విద్యావంతులు, మేధావులు జై తెలంగాణ నినాదంతో దిక్కులు బిక్కటిల్లెల తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసి తెలంగాణ హక్కులకై పోరాడి మూడు వందల అరవై తొమ్మిది మంది అమరుల రక్తంతో తడిసిన మట్టిలో అణువు అణువు పోరాట పట్టిమ ఉంది ఆ ఆనవాళ్లతో మళ్లీ పుట్టుకు వచ్చిందే మలిదశ ఉద్యమం ప్రత్యేక రాష్ట్రం వస్తే తప్ప తెలంగాణ బతుకులు మారవని భావించి ప్రొఫెసర్ జయ శంకర్ సార్ సలహా సూచనలతో, కేసిఆర్ సారథ్యంలో, ప్రజలందరి ఐక్యతతో సుధీర్ఘ కాలం పోరాట, విద్యార్థి అమరుల త్యాగ ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ పార్టీ మేము ఇచ్చిన రాష్ట్రం అంటూ స్వార్థ రాజకీయాలు చేస్తుంది. నేడు కాంగ్రెస్ పాలకులు తెలంగాణ ఉద్యమంలో లేరు పైగా తెలంగాణ ఆనవాళ్ళు లేకుండా చేస్తామంటూ వెక్కిలి చేష్టలతో తెలంగాణ అస్తిత్వంపై దెబ్బ కొడుతున్నారు. తెలంగాణ అంటేనే నిత్యం వెలిగే ఉద్యమ కాగడ అని ప్రపంచానికి ఎరుకా, తెలంగాణ అంటే మీరు మార్చిన తెలంగాణ తల్లి కాదు జై తెలంగాణ అంటే ప్రజలకు ఒక భావోద్వేగం. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ తల్లికి నగలు ఎందుకు అంటున్నారు, ఏ కొడుకు అయినా పేదరికంలో ఉన్న తన తల్లికి మాసం బంగారమైన కొన్నిచ్చే ప్రయత్నం చేస్తాడు అమ్మ ఆత్మగౌరవంతో నలుగురిలో గౌరవంగా ధైర్యముగా ఉండాలి అన్నుకుంటారు, అటువంటిది తెలంగాణ తల్లికి నగలు ఎందుకంటూ తక్కువ చేసి మాట్లాడుతూ అధికార ధర్పంతో తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారు. కాంగ్రెస్ పాలకులు తెలంగాణ ప్రాముఖ్యత తెలియకుంటే తెలుసుకుని పరిపాలిస్తే ఎల్లకాలం సమాజం యాదికి చేసుకుంటుంది లేదంటే నేటికి ఎన్నటికి చరిత్ర హీనులుగా మిగిలి పోతారు ఈ పుడమిపై. దేశంలో ఎక్కడైనా మేధావి వర్గం అంటేనే వివిధ ప్రాంతాలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నిస్తూ ప్రజాభిప్రాయాలను నిత్యము విశ్లేషిస్తూ ప్రభుత్వాలకు చురకలు అంటిస్తుంది కానీ తెలంగాణలో మేధావులము అన్ని చెప్పుకునే కొంతమంది ధన, పదవి వ్యామోహా?లతో అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారు, తెలంగాణ సమాజం మిమ్మల్ని ఎప్పటికీ క్షమించదని మరువరాదు, అందుకే ఆనాడు ప్రజా కవి కాళోజీ ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలో బొంద పెట్టుదాం ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమి తరిమి కొడుదాం అన్నారు. విద్యావంతులు మేధావులు ఇకకైనా మీ మౌనం విడి తెలంగాణ హక్కుల పరిరక్షణకై కదులుదాం తెలంగాణకు రావాల్సిన కేంద్ర నిధులు, కృష్ణా, గోదావరి జలాల వాటా వంటి అంశాలపై నీలదీద్దాం. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్న ఆంధ్ర బానిసలను తరిమి తెలంగాణ ఆత్మగౌరవ పతాక ఎగురవేద్దాం. అరవై ఏళ్ల తెలంగాణను సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకకు నెట్టి తెలంగాణను అవహేళన చేసిన వారికి విగ్రహా?లు, పూలమాలలు తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారికి అవమానలు, చిత్కారాలు అది కాక నేటి కాంగ్రెస్ పాలకులు అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఉద్యమ చరిత్రను చెరిపేయాలని చూస్తున్నారు. ఏం మారింది ఆనాడు తెలంగాణ భాష యాసపై ఆంధ్ర పాలకుల చిన్న చూపు, నేడు కాంగ్రెస్ నాయకులు అవార్డు, రివార్డులలో వివక్షత చూపడమే కాకుండా తెలంగాణ ఉద్యమకారులకు వేధింపులు. తెలంగాణలో ఏం జరుగుతుంది ఎవరు ఏలుతున్నారు ప్రజలు ఒక్కసారి ఆలోచించడి. ఒక వైపు ప్రగతి సంబురాలంటూ వేడుకలు మరో పక్క రైతులు పండించిన ధాన్యముతో కలాలలో పడిగాపులు, రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున కూడా రైతులు సంతోషంగా లేరు అంటే తెలంగాణ ఏర్పాటుకు సార్థకత ఎక్కడ ఉంది. కాంగ్రెస్ పాలనలో ఎవ్వరు సంతోషముగా లేరు అనడానికి అనేక సందర్భాలు చూశాము. తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పడిన పదేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు తీసిన కాంగ్రెస్ పాలనలో అట్టకెక్కింది ఇదేంటని ప్రశ్నించిన వారిపై నిర్బంధాలు, అక్రమ కేసులు అయినా తెలంగాణ ప్రశ్నించే తత్వం కోల్పోదు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటి మాత్రం గుర్తుకు పెట్టుకోవాలి ఉద్యమ సమయంలో సోషల్ మీడియా లేదు ఇష్టానుసారముగా ఆంధ్ర పోలిస్ లు లాఠీలు జులిపిన, జైళ్లలో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధైర్య పడకుండ జైలు గోడలు బద్దలు అయ్యేలా జై తెలంగాణ అంటూ నినాదించిన చరిత్ర తెలంగాణకు ఉంది. ఉద్యమ సమయంలోనే భయపడక కేంద్ర మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించుకున్నం ఇప్పుడు మీ తాటాకు చప్పులకు జంకుతామనుకుంటే అది మీ భ్రమే అని గమనించాలి. తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణకై ప్రజలందరము ఉద్యమ పోరాట స్ఫూర్తితో కలిసికట్టుగా ముందుకు కదులుతూ గర్జిద్దాం తెలంగాణ వ్యతిరేక దుష్ట శక్తులను తరుముదాం తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుందాం.

– మిద్దె సురేష్
కవి, వ్యాసకర్త, సమీక్షకులు
9701209355

### మొగులు మీద
## మలుగని బొమ్మ

నీ తలపు రాగానే
నా కంటి పంజారాన చిక్కిన
కన్నీటి చిలుకలకు మోక్షం కలిగింది తెల్సా
నా చెంపల తీరాన అవి పారాడుతున్నపుడు
ఇసుకతిన్నెల మీద లేత పాదాల
గురుతులు వదిలినట్టు
చెంప పొడవునా కన్నీటి చిలుకలు తిరిగిన గురుతులే

నా ఆశల నెలవంక నీవు
ఎదిగెదిగి వెన్నెలవుతుంటే
నా మోమెంత ప్రకాశం అవుతుందో
నా జీవితాన నిత్యం పారాడే
ప్రకృతి స్రవంతి నీవని
ఎన్నెని మార్లు గర్వంగా జబ్బలు చరచుకున్నానో

నీవు ఉత్త ఇష్టమైన ఊహవు కాదు
ఊపిరైన నేస్తానివి
ఆక్సిజన్లో రెండు మూలకాలు
ఆక్సిజన్ మాత్రమే కానీ...
నా శ్వాసలో ఒక మూలకం ఆక్సిజన్ ఐతే
నీ ఆలోచన నాకు ఇంకో మూలకమైతది
నీ తలపు లేకుండా పీల్చే శ్వాస కూడా
నాకు ఊపిరిని కలిగించదు

నీ యాది వసంతాన్ని ముందే పిలిచి
జీవితాన అలుముకున్న శిశిరాలను తరిమేది
ఇప్పుడంతా తలకిందులైంది
నీ ఊహ మనసులో మెదిలితే చాలు
ఎండిన ఆకులోలే కన్నీళ్లు టపటపా రాలి
మోడుబారిన అడవసోంటి బతుకును
మొగులుమీద మలుగని బొమ్మగా గీసి
లోకం మీదకి విసురుగా విసిరింది తెల్సా...

– దిలీప్.వి
మల్లంపల్లి, ములుగు
సెల్: 8464030808

## అంగడి సరుకు...

బుక్కెడు బువ్వ కోసం..
ఆమె అగ్గువ అంగడి సరుకై..
అతివ దేహమే వ్యాపార వస్తువై..
మనసును నిత్యం చంపుకొని..
పడుపు వృత్తి పద్మవ్యూహంలో..
కామాంధుల కబంధ హస్తాల్లో చిక్కి..
మృగాళ్లకు శరీరాన్ని అర్పిస్తోంది !

నాలుగు గోడల బందీఖానాలో..
చీకట్లో నిశ్శబ్ద రోదనల నడుమ..
కండలు బలిసిన క్రూరుల చేతుల్లో..
మాంసపు ముద్దగా నలిగిపోతూ..
నిత్యం పువ్వులా వాడిపోతూ..
కష్టనష్టాల కడలిలో ఎదురీదుతూ..
కన్నీళ్లను మదిలో దాచుకుంటోంది !

లేని నవ్వును తెచ్చి పెట్టుకొని..
రెండు పూటల కూడు, గుడ్డ కోసం..
పలుమార్లు పరుపులా మారిపోతూ..
జీవచ్ఛవంలా వేశ్య వాటికల్లో..
ప్రతి క్షణం చస్తూ.. లేస్తూ.. అర్పిస్తూ..
పడుపు వృత్తిలో చిక్కిశల్యమవుతోంది !

విటుల వికృత రాక్షస చేష్టలకు..
తన దేహాన్ని క్రీడా మైదానంగా మార్చిన..
ఆమెకు ఇల్లు..తన వాళ్ల ఆనవాళ్లు లేని..
బజారులో నిలబడి బ్రతిమిలాడుతూ..
ఆకలి కేకలతో ఆహ్వానం పలుకుతూ..
తన ఉనికినే కోల్పోయింది అంగడి బొమ్మ
నాటి ఇంటి కూతురు..నేటి నిస్సహాయ స్త్రీ !

మధుపాలీ
9949700037



## మున్ముందు వర్షాభావ పరిస్థితులు

### నీటిని పొదుపుగా వాడుకోవాలన్న మంత్రి

**రాజమహేంద్రవరం,జూన్1(నినాదం):** వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముందుగానే నాట్లు వేసుకొని పంటలను రక్షించుకోవాలని రైతులకు మంత్రి కందుల దుర్గేశ్ సూచించారు. ముందస్తు నీటి విడుదలతో త్వరగా పంట చేతికి వస్తోందని, దీంతో నష్టాల బారి నుంచి రైతు గట్టెక్కవచ్చాన్నారు. నీటిని పొదుపుగా వాడుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి ఖరీఫ్ సీజన్ సాగునీటిని విడుదల చేసినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తూర్పు డెల్టా కాలువ ద్వారా సుమారు 85 వేల ఎకరాలకు, నిడదవోలు, కొవ్వూరు కాలువల ద్వారా మరో 41 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని



ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే గోదావరి డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కాలువల మరమ్మతులకు మరో రూ.13 కోట్లు విడుదల చేసి, సాగునీటి సంఘాల ద్వారా 80 శాతం పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రైతు బాగుంటే గ్రామం, రాష్ట్రం, దేశం బాగుంటుందనే సిద్ధాంతంతో సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. బ్యారేజ్ మరమ్మతులు, కాలువల పునరుద్ధరణ పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. కాటన్ బ్యారేజ్‌లో 117 గేట్లను కొత్తవిగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గించి రైతులకు మేలు చేకూర్చే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఇదిలావుంటే దుక్కి దున్నడం నుంచి పంట విక్రయం వరకు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చుతున్న అన్నదాతలకు ఆదాయం అంతంతమాత్రంగానే వస్తోంది. సాగులో తెగుళ్లు, వడగళ్ల వానలు నష్టం మిగల్చగా వరి కోతలతో రైతులకు ఆర్థిక మోత పడుతోంది. ధాన్యాన్ని కల్లాలకు, కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు, ఇళ్లలోకి తరలించడానికి రవాణా ఛార్జీలు సైతం తడిసి మోపెడవుతున్నాయి. ఇంధనం ధరల హెచ్చు తగ్గులను సాకుగా చూపుతూ యంత్రాలు, ట్రాక్టర్ల యజమానులు అద్దె ధరలను పెంచేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రబీలో ఎకరానికి పెట్టుబడిగా రూ.40 నుంచి రూ.45 వేలు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

## సెక్స్ వర్కర్స్ రహిత భారతాన్ని నిర్మించలేమా !

### "అంతర్జాత సెక్స్ వర్కర్స్ దినం" సందర్భంగా...

సెక్స్ వర్కర్స్ లేదా వ్యభిచార వృత్తి చేసే అభాగ్య మహిళలను నీచంగా, అత్యంత చులకనగా చూస్తున్నది నేటి పౌర సమాజం. సెక్స్ వర్కర్లకు కనీస గౌరవం, మర్యాద, భద్రత, మానవ హక్కులు లేని సమాజంలో మనం ఉన్నాం. రెండు పూటల తినడానికి పడుపు వృత్తి ఊబిలోకి లాగేయపడుతున్నారు నిరుపేద మహిళలు. వేశ్య వాటికలు విటులకు మాత్రమే శారీరక సుఖాలను అందించే కేంద్రాలు. పువ్వును నలిపేస్తూ రాక్షస ఆనందాన్ని పొందే మృగాళ్లు ఉన్న సమాజంలో వ్యభిచారం కొనసాగుతూనే ఉంటుంది. తమను తాము పోషించుకోవడానికి వేరే మార్గాలు లేకపోవటంతో పడుపు వృత్తి ఊబిలో చిక్కిన వారే అధికంగా ఉన్నారు. విడాకులు తీసుకున్న మహిళలు, సమాజ ఆదరణ కోల్పోయిన వారు, కుటుంబాల నుంచి వెలి వేయబడిన మహిళలు, బలవంతంగా ఈ వృత్తిలోకి లాగబడిన మహిళలు లేదా కౌమార యువతులు వ్యభిచారమే ఒక వృత్తిగా ఒళ్లును అమ్ముకొని, అయిష్టంగా, మరో మార్గం లేక వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్నారు. సెక్స్ వర్కర్ల వృత్తి వల్ల హెచ్ఐవి–ఎయిడ్స్‌తో పాటు ఇతర సుఖ వ్యాధులు విస్తరిస్తున్నాయి.

**సెక్స్ వర్కర్స్ హక్కుల పోరాటానికి 50 ఏండ్లు:**

ప్రపంచ చరిత్రలో సెక్స్ వర్కర్స్ హక్కుల పోరాటానికి 51 ఏండ్లు నిండాయి. 02 జూన్ 1975న ఫ్రాన్స్‌లోని లయాన్ ప్రాంత సెయింట్–నిజియర్ చర్చ్ వద్ద సెక్స్ వర్కర్లు ఏకమై తమ భద్రత, గౌరవం, మర్యాద, శ్రామిక హక్కులు, కనీస మానవ హక్కుల కోసం 8–రోజుల పాటు ఆందోళన చేపట్టడం కారణంగా వేశ్యల సమస్యల పట్ల ప్రపంచ దేశాలు ఆలోచించడం ప్రారంభించాయి. ఈ సంఘటనను గుర్తుగా ప్రతి ఏట 02 జూన్‌న "అంతర్జాతీయ సెక్స్ వర్కర్స్ దినం(ఇంటర్నేషనల్ సెక్స్ వర్కర్స్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. సెక్స్ వర్కర్లు కూడా సామాన్య మనుషులే అని, బతకడం కోసం అయిష్టంగా పడుపు వృత్తిలోకి దిగాల్సి వచ్చిందని, వారికి కూడా మానవ హక్కులు ఉంటాయని గమనించాలి. వేశ్యల పట్ల నీచమైన భావనలు, ఆ వృత్తి పట్ల అసహ్యకర ఆలోచనలను కలిగి ఉన్న పౌర సమాజం, ఆ వృత్తిలో నలుగుతున్న మహిళల పట్ల కనీస గౌరవం చూపించడం, వారికి అవగాహన కల్పించడం, వారి ఆరోగ్యానికి రక్షణ గొడుగులు పట్టడం, వారి పిల్లలకు కనీస అవసరాలు తీర్చడం నిరంతరం కొనసాగాలి.

**భారత్‌లో భారీ లౌంగిక వాణిజ్య పరిశ్రమ:**

భారత దేశంలో షరతులతో కూడిన పరిమిత స్థాయి వ్యభిచారం చట్టబద్ధమైనదే అయినప్పటికీ వేశ్యా గృహాలు కోరడం, వాటిని స్వంతం చేసుకోవడం, నిర్వహించడం, హోటల్‌లో వ్యభిచారం, పిల్లల వ్యభిచారం, పింపింగ్, పాండరింగ్, క్రాలింగ్ లాంటివి మాత్రం చట్టవిరుద్ధం. 2016 వివరాల ప్రకారం, భారత్‌లో దాదాపు 6,57,829 మంది వేశ్యలు ఉన్నారని, వీరిలో 35 శాతం వరకు 18 ఏండ్ల లోపు యువతులు ఉండవచ్చని అంచనా. ఇతర అనధికారిక అంచనాల ప్రకారం, మరో 3 మిలియన్ల మంది సెక్స్ వర్కర్లు ఉన్నారని తెలుస్తున్నది. 1997 నుంచి 2004 మధ్యలో వేశ్యల సంఖ్య 50 శాతం పెరిగినట్లు తెలుస్తున్నది. ప్రపంచంలోనే అతి పెద్ద వాణిజ్య లైంగిక పరిశ్రమగా పరగణించబడుతూ బిలియన్ డాలర్ల విలువైనదిగా గుర్తించబడుతున్నది. ఇది సెక్స్ టూరిజంలో కూడా అమితంగా ఆకర్షిస్తున్నది. భారత్‌లో వ్యభిచారం వివిధ రూపాల్లో వ్యక్తం అవుతున్నది. వేశ్యా గృహాలు, వీధుల్లో నిలబడి విటులను ఆకర్షించే వ్యభిచారాలు, టెలిఫోన్ ద్వారా అపాయింట్‌మెంట్ ఇచ్చే కాల్ గర్ల్స్, వినోదం కోసం అందుబాటులో ఉండే ఎస్కార్ట్ ఏజెన్సీలు, ప్రైవేట్ నివాసాలు, మసాజ్ – స్పా పార్లర్లు, హోటళ్లు, నైట్ క్లబ్బులు, బార్లు, వర్చువల్/సైబర్/ఫోన్ సెక్స్ సేవలు, నృత్యకారుల రూపంలో దేవదాసీలు, లైంగిక అక్రమ రవాణా, తవైఫ్ సంస్కృతులు లాంటి రూపాల్లో వ్యభిచార వృత్తి కొనసాగుతున్నది. భారత్‌లోని సోనాగాచి – కోల్‌కతా, కామాతిపురా – ముంబై, బుధ్వార్‌పేట్ – పూణె, ముజఫర్‌పూర్, వారణాసి, న్యూఢిల్లీ, నాగ్‌పూర్, గ్వాలియర్, ప్రయాగ్‌రాజ్ లాంటి జిల్లాల్లో రెడ్–లైట్ ఏరియాలు పెద్ద ఎత్తున ఉన్నాయి.

వ్యభిచార వృత్తిని ప్రభుత్వాలు క్రమంగా తగ్గించడానికి కృషి జరగాలని, పడుపు వృత్తి ఎన్నటికీ సమాజ గౌరవాన్ని పొందలేదని, కనీసం వారి తర్వాత తరం అయినా సన్మార్గంలో నడవడానికి తగు చేయూతను అందించాలని కోరుకుందాం, సెక్స్ వర్కర్లు లేని సమాజాన్ని నిర్మిద్దాం.

డాక్టర్. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఎల్లమ్మతల్లి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**మంథని, జూలై 06(సింగిడి):** ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించి తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ధన్వాడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని, సమాజంలో ఐకమత్యం, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ధన్వాడ గ్రామ ప్రజలు ఐక్యంగా కలిసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు.

# బీఎల్ఏల పాత్రే పార్టీ విజయానికి కీలకం

## మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, జూలై 06(సింగిడి):** బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) పాత్ర పార్టీ విజయానికి అత్యంత కీలకమని మాజీ ఎమ్మెల్యే, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కోరుకంటి చందర్ అన్నారు. గంగానగర్‌లో జరిగిన 5వ డివిజన్ బీఎల్ఏల సమీక్ష సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అనంతరం బీఎల్ఏలకు పార్టీ ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మూల విజయరెడ్డి, 5వ డివిజన్ ఇన్‌చార్జి సకినాల ప్రతాప్, మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి, అల్లం ఐలయ్యతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటి సంరక్షించాలి



## ఇంటికొక మొక్క నాటడం మన నినాదం కావాలి

## మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

**జమ్మికుంట, జులై 6 (సింగిడి):** ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అప్పుడే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని భవిష్యత్తులో దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవాపురం సమ్మక్క గద్దెల పరిసర ప్రాంతంలో స్థానిక కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్ తో కలిసి మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. వన మహోత్సవంలో భాగంగా కేశవాపురం సమ్మక్క గద్దెల పరిసర ప్రాంతంలో మొక్కలు నాటి వాటికి రక్షణ గార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలోనీ సమ్మక్క గద్దెల ప్రాంతంలో మొక్కలు నాటడం జరిగిందని ఇక్కడ ఉన్న విశాల ప్రదేశంలో ఎక్కువగా అల్లనేరేడు,జమ వంటి మొక్కలు నాటడం ద్వారా మూగ జీవాలకు ఆహారాన్ని అందే విధంగా సహాయ పడ గలమని తెలిపారు. ఇలా పండ్ల మొక్కలు నాటడం ద్వారా కోతులు కూడా మానవ నివాస ప్రాంతాల్లోకి రాకుండా ఉంటాయని అలాగే దుబ్బ మల్లన్న ఆలయ పరిధితోపాటు ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్న మొక్కలు నాటడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ప్రతి మహిళ అందరు కూడా వారి నివాసం ఉంటున్న గృహాలలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటాలి తల్లి జన్మనిస్తే మొక్కలు పునర్జన్మ ఇస్తాయంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్,అర్పి స్వరూప, అంగన్వాడీ టీచర్ శివ భారతి, ఆశ వర్కర్ స్వప్న రమేష్, సతీష్, సురేష్, అంజి, కమలాకర్, అజయ్, సాయికిరణ్, నందు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అర్బన్ బ్యాంక్‌లో కోర్టు ఆదేశాలు వెంటనే అమలు చేయాలి

## పాత బాధ్యతల నిర్వహణ కమిటీ'కి తక్షణమే పరిపాలన అప్పగించాలని అధికారులకు వినతి



**కరీంనగర్, జులై 6(సింగిడి):** కరీంనగర్ సహకార పట్టణ బ్యాంకుకు సంబంధించిన తెలంగాణ సహకార ట్రిబ్యునల్, వరంగల్ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే అమలు చేసి, బ్యాంకు పరిపాలనా బాధ్యతలను పాత బాధ్యతల నిర్వహణ కమిటీ (పీఐసీ)కి అప్పగించాలని కోరుతూ, సోమవారం రోజున పాత కమిటీ పాలక వర్గం సభ్యులు తో కలిసి పర్సన్ ఇంచార్జి గడ్డం విలాస్ రెడ్డి జిల్లా సహకార అధికారి, సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్, బ్యాంకు ప్రధాన కార్యనిర్వహణ అధికారికి వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.తెలంగాణ సహకార ట్రిబ్యునల్ ఐ.ఏ. నెం.163/2025, 166/2025 కేసుల్లో జూలై 1న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం, 2025 నవంబర్ 1న ప్రకటించిన ఎన్నికల ఫలితాలపై నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఎన్నికైన పాలకవర్గానికి బ్యాంకు వ్యవహారాల్లో పాల్గొనే హక్కు లేదని, వివాదాస్పద ఎన్నికలకు ముందు ఉన్న ,బాధ్యతల నిర్వహణ కమిటీ (పీఐసీ) నే రోజువారీ పరిపాలన నిర్వహించాలని ట్రిబ్యునల్ స్పష్టం చేసిందన్నారు. సహకార చట్టం ప్రకారం పాలకవర్గం పదవీకాలం ముగిసినా లేదా కోర్టు ఆదేశాలతో తొలగించబడినా, కోర్టు సూచించిన కమిటీకి వెంటనే బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ పరిపాలనా బాధ్యతల బదిలీలో జాప్యం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.బ్యాంకు పాలన నిరాటంకంగా కొనసాగేందుకు, చట్టబద్ధతను పరిరక్షించేందుకు పాత బాధ్యతల నిర్వహణ కమిటీకి తక్షణమే బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో సభ్యులు ముక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు జిల్లా కలెక్టర్‌కు వినతి

## ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

## త్వరలో పనులు చేపడతామని అధికారుల హామీ



**కరీంనగర్, జులై6(సింగిడి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలోని వాకింగ్ ట్రాక్ దెబ్బతిని గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచి వాకర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని పేర్కొంటూ, ట్రాక్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్‌లను కూడా కలిసి సమస్యను వివరించారు.అదేవిధంగా, ప్రస్తుతం వినియోగంలో లేని మరో వాకింగ్ ట్రాక్‌ను కూడా మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు త్వరలోనే మరమ్మతు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. స్టేడియంలో వాకర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ గౌడ్ ట్రాక్ వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు, పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాకింగ్ చేసే మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిపాటి రమణరెడ్డి, చాడ రవీందర్ రెడ్డి, ఎం.ఎ. హమీద్, బండవరం సుమన్, మిర్యాల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

## .డీఆర్ఓ రాజేశ్వరి

**పెద్దపల్లి, జూలై 06(సింగిడి):** ప్రజావాణి ద్వారా వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, అంగన్‌వాడీ పోస్టు, ప్రభుత్వ బోర్‌వెల్ ఏర్పాటు, గురుకుల పాఠశాల ప్రవేశం తదితర అంశాలపై సంబంధిత శాఖలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



# మార్కెట్ యార్డు అభివృద్ధికి మరింత నిబద్ధతతో పనిచేస్తాను

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్నకు టీఎన్‌జీఓఎస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

## రైతు ప్రయోజనాలు, మార్కెట్ యార్డు అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసలు



**కరీంనగర్, జూలై 6(సింగిడి):** రైతు సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ యార్డు సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్నను తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (టీఎన్‌జీఓఎస్) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ కుటుంబం నుంచి ఎదిగిన ఆకుల నరసన్న రైతుల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పన, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం ఇస్తూ రైతు ప్రయోజనాలే ధ్యేయంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.సన్మానానికి స్పందించిన ఆకుల నరసన్న టీఎన్‌జీఓఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధికి మరింత నిబద్ధతతో పనిచేస్తానని, ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సంఘ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంజాల శ్రీనివాస్, బోనాల శ్రీనివాస్, ఖాజా, శంకర్, తల్లపల్లి రాజు, కంకయ్య, సంపత్, భూమయ్య, మాలతి, టీఎన్‌జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, సెంట్రల్ యూనియన్ కార్యదర్శులు గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్వీందర్ సింగ్, జిల్లా యూనియన్ కోశాధికారి కిరణ్ కుమార్, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు రాజేష్ భారద్వాజ్, క్లాస్-4 జిల్లా అధ్యక్షుడు రామస్వామి, టీఎన్‌జీఓస్ నాయకులు, ఉద్యోగులు, మార్కెట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక కొరతతో నిలిచిన ఇందిరమ్మ ఇండ్లు

## అధిక ధరకు కొనలేక లబ్దిదారుల అవస్థలు

## తక్కువ ధరకే ఇసుకను సరఫరా చేయాలి

## బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు డిమాండ్

## ఇసుకపై బిజెపి నేతల నిరసన దీక్ష..




**జమ్మికుంట, జూలై 6 (సింగిడి):** సముద్రం తలాపున పెట్టుకుని చాప ధూపకేడ్చినట్లు జమ్మికుంట పట్టణం మానేరు పరివాహక ప్రాంతంలో ఉన్నప్పటికీ ఇసుక కోసం ప్రజలు అలమటిస్తున్నారని బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు అన్నారు. సోమవారం జమ్మి కుంట గాంధీ చౌరస్తాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అతి తక్కువ ధరకు ఇసుకను సరపర చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కొలకాని రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని అందుకోసం విడతలవారీగా లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని తెలిపారు. కానీ లబ్ధిదారులకు ఇసుక దొరకక 2000 రూపాయలకు ఒక ట్రాక్టర్ ఇసుక గతంలో లభించేదని ప్రస్తుతం 7000 చెల్లించినప్పటికీ ఒక ట్రాక్టర్ ఇసుక వారికి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కు పాదం మోపడంతో మానేరు పరివాహక ప్రాంతం నుండి ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఇసుక సరఫరా నిలిచిపోవడంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల ఇంటి నిర్మాణం జరగకపోతే వారికి రావలసిన బిల్లులు రావని వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు లబ్ధిదారులను కోరుతున్నారు. కానీ ఇంటి నిర్మాణం జరగాలంటే ఇసుక దొరకాలి ఒక ట్రిప్పు ఇసుక ధర 7వేల రూపాయల నుండి 8 వేల రూపాయల ధర పలకడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నేతలు అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ ధార్మిక సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ బచ్చు శివకుమార్ కౌన్సిలర్ తూర్పాటి శంకర్ కొండ్ల నాగేష్ యాంసాని సమ్మయ్య తోపాటు పలువురు బిజెపి కార్యకర్తలు నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# పోరాడే కార్యకర్తలే పార్టీకి బలం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**మంథని, జూలై 06(సింగిడి):** మంథని నియోజకవర్గంలోని అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సమ్మరాజు పార్టీ మారాలంటూ వచ్చిన ఒత్తిళ్లను ధైర్యంగా తిరస్కరించి తన నిబద్ధతను చాటుకోవడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. కన్నెపల్లి పర్యటన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి సమ్మరాజును కలిసిన కేటీఆర్, పార్టీ కోసం పోరాడే కార్యకర్తలే బీఆర్ఎస్‌కు నిజమైన బలమని అన్నారు. కష్టకాలంలో పార్టీని వీడకుండా నిలబడిన కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, రానున్న రోజుల్లో పార్టీ నిర్మాణంలో వారిదే కీలక పాత్ర అని పేర్కొంటూ సమ్మరాజును ప్రత్యేకంగా అభినందించారు.



# బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని స్మరించిన కాంగ్రెస్ నాయకులు

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కరీంనగర్, జూలై 6(సింగిడి):** మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పుల అంజన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ అభివృద్ధితో పాటు ముఖ్యంగా అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహానాయకుడని కొనియాడారు. మాజీ ఉప ప్రధానిగా, పలు కీలక శాఖలకు మంత్రిగా విశిష్ట సేవలు అందించిన ఆయన, 1971 భారత--పాకిస్థాన్ యుద్ధ సమయంలో రక్షణశాఖ మంత్రిగా దేశ విజయానికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ఆయన జీవిత లక్ష్యమని పేర్కొంటూ, ఆయన సేవలు తరతరాలకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పుల అంజన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 7-7-2026

# 'సర్'తో పల్లెలు, పట్టణాల్లో..

# ప్రజల తంటాలు!

ఫారాలు నింపడంలో ఓటర్లకు ఇక్కట్లు

గ్రామీణ ప్రాంతాల్లో మరింత గందరగోళం

2002 నాటి జాబితా

వివరాలు దొరక్క ఇబ్బందులు

బీఎల్వోలే సందిగ్ధంలో ఉండటం

రాజకీయ పార్టీల భాగస్వామ్యం అంతంతే

అప్రమత్తంగా లేకుంటే ఓటు గల్లంతే

## ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి అందని ఫారాలు



**ఆమనగల్లు, జూలై 06(సింగిడి):** గత నెల 25 నుంచి మొదలైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ఇంటింటి ఎన్యుమరేషన్ ఫారాల నింపడంలో తలెత్తుతున్న సందేహాలు, 2002 నాటి పాత జాబితాలో ఎపిక్ నంబర్లు లేకపోవడం, వయస్సు మరియు ఇంటిపేర్లలోని తప్పులతో ఓటర్లు సతమతమవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన లోపంతో సతమతమవుతుంటే, ఉపాధి కోసం వలస వెళ్ళిన వారికి ఈ ఫారాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. సరైన మార్గదర్శకత్వం లేక, అసమగ్ర వివరాలతో కూడిన ఈ సర్ కార్యక్రమం ప్రజలకు ఆందోళన కలిగిస్తూ, సజావుగా సాగడం లేదు.ప్రస్తుతం పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతిచోటా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గురించే తీవ్ర చర్చ జరుగుతోంది. 2002 నాటి పాత వివరాలను సైతం తప్పనిసరిగా నమోదు చేయాలన్న నిబంధనతో ఓటర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జూన్ 25 నుండి బీఎల్వోలు ఇంటింటికీ తిరుగుతూ ఫారాలు ఇస్తున్నా, వాటిని పూరించడం సామాన్యులకు ఒక పెద్ద తలనొప్పిగా మారింది. ఏ చిన్న పొరపాటు జరిగినా తమ ఓటు గల్లంతవుతుందనే భయం ప్రజలను వెంటాడుతోంది. సంక్లిష్టమైన ఈ ప్రక్రియను ఎలా పూర్తి చేయాలో అర్థం కాక ఓటర్లు అయోమయంలో సతమతమవుతున్నారు.

**2002 ఓటరు రికార్డుల సెగ: గందరగోళంలో ఓటర్లు**

ఎస్ఐఆర్ దరఖాస్తు ప్రక్రియలో 2002 నాటి ఓటరు వివరాలను మొదటి కాలమ్‌లోనే నమోదు చేయాలన్న ఎన్నికల సంఘం నిర్ణయం ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. దశాబ్దాల క్రితం నాటి సమాచారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ, పాత రికార్డుల కోసం వెతకడం అసాధ్యంగా మారింది. వృద్ధులు, సామాన్యులు ఈ నిబంధనతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాత రికార్డుల లభ్యతపై స్పష్టత లేకపోవడంతో, అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి, ప్రక్రియను సరళతరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఓటరు నమోదులో గందరగోళం:**

**గల్లంతవుతున్న అర్హుల ఓట్లు!**

గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. 2002 నాటి ఓటర్ల జాబితా వివరాలు అందుబాటులో లేకపోవడం, ఎన్యూమరేషన్ పత్రాలను ఎలా నింపాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో సరైన అవగాహన లేక, ముఖ్యంగా నిరక్షరాస్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఎల్ఓల సూచనలు ఒక్కొక్కరికి ఒక్కోలా ఉండటంతో ప్రజలు అయోమయంలో ఉన్నారు. సరైన మార్గదర్శకత్వం లేకపోతే అర్హులైన వారి ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. బీఎల్ఏలు చొరవ తీసుకుని, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

**ప్రజల సతమతం!**

గ్రామాల్లో ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెబుతున్నారు. దీంతో వారంతా అయోమయంలోకి వెళ్తున్నారు. ఇక నిరాక్షరాస్యుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. బీఎల్?వోలు ఇచ్చిన పత్రాలను ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు కొంతమంది పేర్లు అసలు 2002 జాబితాలో లేవు. దీంతో లేనివారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## అవగాహన లేక ప్రజల అవస్థలు

ఓటరు నమోదు ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎన్యుమరేషన్ ఫారాలను ఎలా నింపాలో తెలియక ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. 2002 నాటి ఓటరు జాబితాను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల పాత, కొత్త ఓటర్లకు ఒకే రకమైన ఫారాలు ఇచ్చి సతమతం చేస్తున్నారు. ఎపిక్ నంబర్, భాగం సంఖ్య, క్రమ సంఖ్య వంటి వివరాల నమోదుపై అవగాహన కల్పించాల్సిన బీఎల్వోలే సందిగ్ధంలో ఉండటం విచారకరం. సరైన మార్గదర్శకత్వం లేక పత్రాలు నింపలేక సామాన్యులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ గందరగోళానికి తెరదించి, ప్రజలకు సహకరించేలా చర్యలు తీసుకోవాలి.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

పెండింగ్ లేకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 6(సింగిడి):** ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 169 దరఖాస్తులు అందగా, గృహ నిర్మాణ శాఖకు అత్యధికంగా 67, కరీంనగర్ నగరపాలక సంస్థకు 54 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

## కొనసాగుతున్న సుంకిరెడ్డి మెగా వైద్య శిబిరం



**ఆమనగల్లు, జూలై 6 (సింగిడి):** తలకొండపల్లి మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరం, గత మూడు రోజులుగా ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగుతోంది. స్థానికులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో, నిపుణులైన వైద్యులు ఎంతో ఓపికగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాల పంపిణీతో పాటు, శుక్లాల సమస్య ఉన్న వారికి ఉచిత సర్జరీలను కూడా అందిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చూపుతున్న ఈ చొరవ అభినందనీయం. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ కంటి చూపును కాపాడుకోవాలని కోరుతున్నారు.

## ఫోర్త్ సిటీకి భూమిని తీసుకుంటే రైతులకు న్యాయంగా నష్టపరిహారం అందించాలి

లేదంటే బిఆర్ఎస్ పార్టీ

రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంది

మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం జులై 06 (సింగిడి):** రైతులు నష్టపోకుండా రీ సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కందుకూరు మండల పరిధిలోని సార్లరావులపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోతుబండ తండా పోర్త్ సిటీ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం అందించాలని ధర్నా చేస్తున్న రైతులకు మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బిఆర్ఎస్ పార్టీ తరపున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా ప్రభుత్వం న్యాయం చేయాలని లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో రైతుల నుండి భూమిని తీసుకుంటే న్యాయపరమైన నష్ట పరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్నికి హెచ్చరించారు. అనంతరం మంగలిగడ్డ తండా రైతులు చేస్తున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రవీణ్ నాయక్, గోవర్ధన్ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీ నరసింహ రెడ్డి, కందుకూరు మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ ,సురసాని సురేందర్ రెడ్డి, దేవరశెట్టి చంద్రశేఖర్, మేఘనాథ్ రెడ్డి, తాండ్ర ఇందిరా దేవేందర్, కాకి ఇందిరా దశరథ, ఆనేగౌని దామోదర్ గౌడ్, ప్రకాష్ రెడ్డి పొట్టి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం వేధింపులు.. భర్త అత్తమామలపై కేసు

**వనపర్తి ప్రతినిధి, జులై 6 (సింగిడి):** అదనపు కట్నం కోసం ఓ వివాహితను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఇంట్లో నుంచి వెళ్లగొట్టిన భర్త, అత్తమామలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏదుల మండలం చెన్నారం గ్రామానికి చెందిన పల్లవికి, పోలికే పహాడ్ గ్రామానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తితో నాలుగేళ్ల క్రితం పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. పెళ్లి సమయంలో పల్లవి తల్లిదండ్రులు రెండు తులాల బంగారం, రూ.2 లక్షల నగదును కట్నంగా ఇచ్చారు. పెళ్లయిన రెండేళ్ల వరకు దంపతులు హైదరాబాద్‌తో పాటు స్వగ్రామంలో బాగానే ఉన్నారు.అయితే గత రెండేళ్లుగా భర్త శివకుమార్, అత్త లక్ష్మి, మామ చిన్నయ్యలు అదనపు కట్నం తేవాలంటూ పల్లవిని వేధించడం మొదలుపెట్టారు. పల్లవి తల్లి కట్టించిన ఇంటిని భర్త శివకుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పల్లవి తన కుటుంబ సభ్యులకు తెలపగా నాలుగు సార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించి నచ్చజెప్పారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే ఈ నెల1న (01-07-2026) సదరు ముగ్గురు నిందితులు కలిసి పల్లవిని చేతులతో తీవ్రంగా కొట్టి ఇల్లు తన పేరిట చేసేవరకు ఇంట్లోకి రావద్దంటూ బలవంతంగా బయటకు నెట్టివేశారు. అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తూ తరిమేసిన భర్త, అత్తమామలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితురాలు పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్ ప్రక్రియలో కార్యకర్తలు పట్టుదలతో పాల్గొనాలి

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్



**వనపర్తి ప్రతినిధి, జులై 6 (సింగిడి):** సర్ ప్రక్రియలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు అంతే పట్టుదలతో పాల్గొనాలని, మన ఓటు చోరీ కాకుండా చూసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ కోరారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో బిఎల్ఏ ల సమావేశం నిర్వహించి ఓటర్ జాబితా సవరణను సమీక్షించి వారికి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో గందరగోళానికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటి వరకు జరిగిన సర్ ప్రక్రియ గురించి తెలుసుకొని ఓటర్ నమోదు ఎట్లా చేయాలని సోదాహరణంగా వివరించి బిఎల్ఏ లకు గల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ఉన్నారు.

## ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశం





**మేడ్చల్ కలెక్టరేట్, జులై 6 (సింగిడి):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ మాలతి లతో కలిసి అదనపు కలెక్టరు (79) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతకు పట్టం... కార్యదీక్షకు గౌరవం

శాసనమండలిలో ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ కార్యాలయం ప్రారంభం

అంబర్‌పేట్ గ్రేవ్‌యార్డు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు



**హైదరాబాద్, జూలై 6 (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ కోసం దీర్ఘకాలం పాటు చేసిన పోరాటానికి గుర్తింపుగా వచ్చిన బాధ్యతలను ప్రజాసేవకు వినియోగిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లిడాక్టర్ బల్మూరి వెంకట్‌లి అన్నారు. శాసనమండలిలో ఆయన ప్రభుత్వ విప్ కార్యాలయం (పేషీ)ని సోమవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు లిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ లిలిగడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ లిలిగుత్తా సుఖేందర్ రెడ్డిలితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి లిఅజారుద్దీన్‌లితో కలిసి హైదరాబాద్ అంబర్‌పేట్‌లోని గ్రేవ్ యార్డును డాక్టర్ బల్మూరి వెంకట్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ గ్రేవ్‌యార్డు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. స్థానిక మైనారిటీ నాయకులు మాట్లాడుతూ, గత ఏడాది ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గ్రేవ్‌యార్డును సందర్శించి సమస్యలను గుర్తించిన అనంతరం ప్రహరీ గోడ నిర్మాణం, విద్యుత్ దీపాల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ వంటి పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన అభివృద్ధి పనులు కూడా త్వరగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి లిరేవంత్ రెడ్డిలి నాయకత్వంలో తెలంగాణలో సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా ప్రజాకేంద్ర పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## వనపర్తి వాసికి ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగం



**వనపర్తి ప్రతినిధి, జులై 6 (సింగిడి):** వనపర్తి పట్టణానికి చెందిన వరుణ్ తేజ్ భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న "ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్"ఉద్యోగం లభించడం అభినందనీయమని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.ఇటీవలే ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసిన వరుణ్ తేజ్ మేనేజ్మెంట్ ట్రైనీగా ఎంపిక అయ్యాడని ఆయన తెలిపారు.ఒక సంవత్సరం శిక్షణ పూర్తయిన వెంటనే అతనికి ఇండియాలో గానీ విదేశాలలోగాని పోస్టింగ్ ఇవ్వవచ్చునని శంకర్ గౌడ్ అన్నారు. వరుణ్ తేజ్ తల్లిదండ్రులు వెంకటయ్య, సుమిత్ర ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులని, వారు టీచర్స్ కాలనీలో నివాసముంటున్న వరుణ్ తేజ్ ను సోమవారం ఆయన ఇంటి వద్ద కళావేదిక ప్రతినిధులు శాలువ జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వరుణ్ తేజ్ చక్కని ఉద్యోగం సాధించడం పట్ల సాహితీ కళా వేదిక సభ్యులు బైరోజు చంద్ర శేఖర్, బండారు శ్రీనివాస్, కంటే నిరంజనయ్య, గంధం నాగరాజు, పి.శ్రీనివాసులు, సురేందర్, నాగన్న తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



## మధుమేహం వల్ల చర్మం.. జుట్టు సమస్యలు
# వస్తాయని తెలుసా?

ఇటీవలి కాలంలో మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తంలో చక్కెర (హై బ్లడ్ షుగర్) సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. సాధారణంగా ఈ సమస్య గుండె, మూత్రపిండాలు, కళ్ల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని చాలా మంది భావిస్తారు. అయితే ఆరోగ్య నిపుణుల ప్రకారం, అధిక రక్త చక్కెర స్థాయిలు చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ కాలం నియంత్రణలో లేకపోతే, శరీరంలోని రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో చర్మం, వెంట్రుకల కుదుళ్లకు అవసరమైన పోషకాలు సరిగా అందక అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

**అధిక రక్త చక్కెర చర్మంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?**

అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం, రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు చర్మ కణాలకు తగినంత పోషణ అందదు.

చర్మం పొడిబారడం
తరచూ దురద రావడం
చర్మ ఇన్ఫెక్షన్లు పెరగడం
గాయాలు నెమ్మదిగా మానడం
చర్మం రంగులో మార్పులు రావడం

**జుట్టు ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతుంది?**
అధిక రక్త చక్కెర వల్ల వెంట్రుకల కుదుళ్లకు సరైన రక్తప్రసరణ జరగదు.
జుట్టు బలహీనంగా మారడం
అధికంగా జుట్టు రాలడం
కొత్త జుట్టు పెరుగుదల మందగించడం
జుట్టు నాణ్యత తగ్గిపోవడం
వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.
ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్ష చేయించుకోండి

రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు కొన్ని సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. వాటిని నిర్లక్ష్యం చేయకూడదు.

తరచుగా దాహం వేయడం
తరచూ మూత్రవిసర్జన
కారణం లేకుండా బరువు తగ్గడం
అధిక అలసట
చూపు మసకబారడం
పునరావృతమయ్యే చర్మ ఇన్ఫెక్షన్లు
గాయాలు ఆలస్యంగా మానడం
అధికంగా జుట్టు రాలడం
ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే రక్తంలో చక్కెర పరీక్ష చేయించుకోవడం మంచిది.

**చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచాలంటే ఏమి చేయాలి?**

మధుమేహం ఉన్నవారు లేదా అధిక రక్త చక్కెర సమస్యతో బాధపడేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.
పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. తీపి పదార్థాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించాలి.
రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు.
శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.
రోజుకు 7–8 గంటల నిద్రతో పాటు ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా చాలా ముఖ్యం. డాక్టర్ సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను తరచూ పరీక్షించుకోవాలి.



## కాల్చిన కొబ్బరితో
# పెరుగు పచ్చడి..



**కొబ్బరి , పెరుగుతో చేసే టేస్టీ టేస్టీ ఆరోగ్యకరమైన రెసిపీ వంటకం. ఈ పెరుగు పచ్చడిని కొందరు అన్ని కాలాల్లో తింటారు. ఇంకా శరీరానికి ఎంతో మేలు చేస్తుంది.అన్నంలోకి కూడా అదిరిపోతోంది. మీరు దీని కోసం గంటలు గంటలు పెట్టాల్సిన అవసరం లేదు. కొద్దీ నిమిషాల్లోనే కూడా తయారు చేయవచ్చు.**

**ఎలా చేయాలంటే?**
కొబ్బరి పెరుగు పచ్చడికి కావాల్సిన పదార్దాలు : మూడు కప్పులు పెరుగు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, ఇంకా తాలింపులోకి ఆవాలు, దీనికి సరిపడా నూనె, అర టేబుల్ స్పూన్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, ఒక టేబుల్ స్పూన్ కారం, మూడు కరివేపాకు ఆకులు, కొత్తిమీర ఆకులు కూడా వేస్తే రుచిగా ఉంటుంది. ముందుగా కొబ్బరిని తీసుకుని గ్యాస్ పొయ్యి మీద బాగా కాల్చుకోవాలి. ఆ తర్వాత దీనిని తీసుకుని ఒక గిన్నెలో పేస్ట్ మాదిరి పెట్టుకోవాలి. అలాగే, పెరుగును తీసుకుని దానిలో కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు కూడా వేసుకోవాలి. ఇక ఇప్పుడు ఒక పాత్రలో పెరుగును తీసుకుని దానిలో రుచికి సరిపడా ఉప్పు,



కొద్దిగా నీళ్ళు పోసి కవ్వంతో బాగా కలుపుకోవాలి.



**పెరుగును ఉడికించుకోవాలి :**
గ్యాస్ పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి దానిలో మీరు తినాలని అనుకుంటే కూరగాయల ముక్కలు, కొద్దిగా పసుపు, రుచికి తగినంత ఉప్పు వేసి మెత్తగా బాగా వేయించాలి. ఇంకా ఈ మజ్జిగను తీసుకుని మీడియం మంటపై ఉడికించాలి. ఇలా చేస్తే పెరుగు పచ్చి వాసన పోయి మంచి రుచి వస్తుంది పోపు పెట్టడానికి మళ్ళీ ఇంకో పాన్ తీసుకుని దానిలో ఆయిల్ వేసి, కొద్దిగా ఆవాలు, ఒక టీ స్పూన్ జీలకర్ర, ఇంకా నాలుగు కరివేపాకు ఆకులు , పచ్చిమిర్చి ముక్కలు, అల్లం పేస్ట్ కూడా, కొబ్బరి కూరగాయల పేస్ట్ వేసి కిందకు దించుకోవడమే. కాల్చిన పెరుగు పచ్చడి తింటే శరీరానికి ఎంతో బలం కొత్తిమీర కూడా వేస్తే తిన్న వెంటనే అరిగిపోతోంది

# భారతీయ సంస్కృతి ప్రతిబించేంది పేరిణి నృత్యం
## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు





**కోరుట్ల, (సింగిడి)** భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబించేంది పేరిణి నృత్యం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. వేసవి సెలవుల సందర్భంగా మెట్ పల్లి పట్టణ మీనాక్షి కళానిలయంలో పేరని నృత్యం శిక్షణ ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ పేరని నృత్యం పురాతనమైన శాస్త్రీయ నృత్యం, మానసిక శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగపడుతుం దన్నారు. ఇది మన భారతీయ ప్రాచీన సంస్కృతిలో భాగమని దీన్ని కొనసాగించడం నేటి సమాజానికి అవసరమని అన్నారు. ఈ సందర్భంగా శిక్షకురాలు శ్రీవాణి కి జువ్వాడి కృష్ణరావు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి, కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.



## 22న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవాల ముగింపు సభ





**హైదరాబాద్, (సింగిడి):** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (BIACH&RI) రజతోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని జూన్ 22న హైటెక్ సిటీలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ నందమూరి బాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకాను న్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి 25 ఏళ్ల సేవలను సమీక్షించడంతో పాటు హైదరాబాద్‌లో నార్త్ బ్లాక్, అమరావతి తుళ్లూరులో నిర్మిస్తున్న నూతన ఆస్పత్రి ప్రాజెక్టుల పురోగతిని వెల్లడించనున్నారు. అంతకుముందు ఆస్పత్రిలో క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారుల మధ్య బాలకృష్ణ తన పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేసి బహుమతులు అందజేశారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధి కోసం అందిన విరాళాలను స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారులు సేవా కార్యక్రమాల కోసం సేకరించిన విరాళాలను ప్రత్యేకంగా అభినందించారు.

## డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం..
# భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం




భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం కలిగింది. ఢిల్లీలో ఈ సంస్థకు చెందిన థర్డ్ పార్టీ డేటా సెంటర్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో నెట్‌వర్కింగ్ పరికరాలు షట్‌డౌన్ అయ్యాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో క్లౌడ్ సేవలకు ఆటంకం ఏర్పడింది.
ఈమేరకు క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ వెల్లడించింది.అయితే ఈ ప్రమా దం ఎప్పుడు జరిగిందో మాత్రం చెప్పలేదు. ప్రాణ, ఆస్తి నష్టం గురించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఇలాంటి అంతరాయాల వల్ల కంపెనీల కార్యకలాపాలు నెమ్మదిస్తుం టాయి. ఢిల్లీ, చెన్నై, ముంబయితో పాటు పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ ట్రాఫిక్ ప్రభావితమైంది. పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని సంస్థ వెల్లడించింది. క్లౌడ్ ప్రొవైడర్లలో అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూర్‌తో గూగుల్ క్లౌడ్‌కు గట్టి పోటీ నెలకొంది.

## భాషా సమస్యకు చెక్ పెట్టేందుకు
# జెమినై 3.5 లైవ్ ట్రాన్స్‌లేట్




ఎవరైనా కాల్ చేసినప్పుడు వారి భాష మీకు అర్థం కావట్లేదా? మీటింగ్‌లో బాస్ మాట్లాడే భాషతో ఇబ్బంది పడుతున్నారా? దీనికి చెక్ పెట్టేందుకే గూగుల్ సిద్ధమైంది. మరో సరికొత్త ఏఐ ఫీచర్‌తో ముందుకొచ్చింది. జెమినై 3.5 లైవ్ ట్రాన్స్‌లేట్ స్పీచ్–టు–స్పీచ్ ట్రాన్స్‌లేషన్ మోడల్‌ను తీసుకొచ్చింది (+వఎఱఅఱ 3 5 ూఱఙవ ువతీaఅంశ్రీaువ). అవతలి వ్యక్తి మాట్లాడే భాషను సెకన్లలోనే మనకు కావాల్సిన భాషలోకి సహజంగా ఏఐ వాయిస్ అనువాదం చేస్తుంది. దీంతో ఆఫీస్ మీటింగ్‌లు, లైవ్ బ్రాడ్‌కాస్ట్ వంటి సమయాల్లో భాషాపరమైన ఇబ్బందులు తప్పనున్నాయి.
ఐఓఎస్‌తో పాటు ఆండ్రాయిడ్ యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. గూగుల్ ట్రాన్స్‌లేట్, గూగుల్ మీట్, గూగుల్ ఏఐ స్టూడియో, గూగుల్ లైవ్ ఏపీఐలో రోల్‌అవుట్ చేసింది. ఏఐ వాయిస్‌లకు సింథ్ఐడీ వాటర్ మార్కింగ్ కూడా జోడించింది. ప్రస్తుతం 70కి పైగా భాషల్లో ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

# బాధిత కుటుంబాలపై ఒత్తిడి లేదు: ఎయిరిండియా



ఎయిరిండియా ప్రమాదం జరిగి ఏడాది కావొస్తోంది.ఆ ఘటనలో మృతి చెందిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కుమార్తె రాసిన ఈమెయిల్‌పై ఎయిరిండియా స్పందించింది. నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి పరిహారాన్ని స్వీకరించాలంటూ ఏ కుటుంబంపై తాము ఎలాంటి ఒత్తిడి తేలేదని సంస్థ వెల్లడించినట్లు సమాచారం.
ఎయిరిండియా ప్రమాద ఘటనపై తుది దర్యాప్తు నివేదిక ఇంకా వెల్లడికాలేదు. ఇంతలోనే తుది పరిహారాన్ని స్వీకరించాలనుకునేవారు.. ఎయిరిండియా, ఇతర భాగస్వామ్య సంస్థలపై దావావేసే హక్కును వదులుకోవాలని బాధిత కుటుంబాలను ఎయిర్‌లైన్ కోరడాన్ని రూపానీ కుమార్తె రాధికా మిశ్రా వ్యతిరేకించారు. ఈ మేరకు టాటాసన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు మెయిల్ చేసినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే రాధికకు ఎయిరిండియా నుంచి లేఖ వచ్చింది. పరిహారం తీసుకునే విషయంలో తాము ఎలాంటి కాలపరిమితి విధించలేదని, తుది దర్యాప్తు నివేదిక వచ్చేవరకు వేచి ఉండేందుకు బాధిత కుటుంబాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని పేర్కొంది.
విమాన ఇంధనం మరో 10% భారం
తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడకుండా.. నష్టపరిహారం నేరుగా పొందాలని పలు కుటుంబాలు కోరుకుంటున్నాయని, అందువల్లే పరిహార ప్రతిపాదనలు చేశామని ఎయిరిండియా వెల్లడించినట్లు తెలుస్తోంది. తాము అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తున్నామని, వాటికి అనుగుణంగానే నష్టపరిహారాన్ని ప్రతిపాదించామని స్పష్టత ఇచ్చినట్లు సమాచారం.

# ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి.. సెన్సెక్స్ +64, నిఫ్టీ-27



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అండతో ఉదయం లాభాల్లో రాణించిన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో ఆ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో సెన్సెక్స్ 64 పాయింట్లు లాభంతో ముగియగా.. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయింది. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు మేర క్షీణించింది.

సెన్సెక్స్ ఉదయం 73,988.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,918.76) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,613.01 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి ఆరంభ లాభాలను కోల్పోయి 73,983.18కి పరిమితమైంది. నిఫ్టీ 23,214.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ముడి చమురు బ్యారెల్ ధర 91.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4167 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# తగ్గిన బంగారం, వెండి ధరలు



**ముంబయి:** దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.4300 క్షీణించి రూ.1.56 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. కిలో వెండి సైతం దాదాపు రూ.10వేలు తగ్గి రూ.2.45 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) పలుకుతోంది. క్రూడాయిల్ రేట్లు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వల్ల డిమాండ్ తగ్గుముఖం పట్టడం కారణంగా ఈ లోహాల ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర రోజు వ్యవధిలో 90 డాలర్లు క్షీణించి 4168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 2.24 శాతం క్షీణించి 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**గోల్డ్‌బాండ్లపై జాక్‌పాట్.. గ్రాముకు 11,500 లాభం**

అమెరికా– ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రారంభం కావడంతో క్రూడాయిల్ ధర మరోసారి 90 డాలర్ల ఎగువకు చేరింది. దీనికితోడు అమెరికా డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు దిగి వచ్చాయని పీఎల్ వెల్త్ ప్రోడక్ట్ అండ్ ఫ్యామిలీ ఆఫీస్ ఇఎడ్ రాజ్‌కుమార్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు, దీర్ఘకాలం అధిక వడ్డీ రేట్లు కొనసాగే అవకాశం ఉండడంతో వీటికి డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణమని చెప్పారు. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, ద్రవ్యోల్బణ భయాలూ కారణమని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ పేర్కొన్నారు.




## మిడ్‌రేంజ్ యూజర్ల కోసం
# రియల్‌మీ నుంచి కొత్త ఫోన్




ఒప్పో అనుబంధ సంస్థ రియల్‌మీ పీ4 సిరీస్‌లో మరో ఫోన్‌ను తీసుకొచ్చింది. పీ4ఆర్ 5జీ (Realme P4R 5G) పేరిట దీన్ని విడుదల చేసింది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్ కోరుకునే వారి కోసం ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. 8000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ, 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో ఈ ఫోన్ వస్తోంది.

రియల్‌మీ పీ4ఆర్ 5జీలో 6.8 అంగుళాల హెచ్‌డీ 144 Hz ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 1200 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. డైమెన్సిటీ 6300 ప్రాసెసర్ ఇచ్చారు. వెనుకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ ఇచ్చారు. ముందు వైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఉంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన రియల్‌మీ యూఐ 7తో పనిచేస్తుంది. 2 ఏళ్లు ఓఎస్ అప్‌డేట్స్, 3 ఏళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తున్నారు. ఐపీ 65 రేటింగ్, ఏఐ పల్స్ లైట్, మిలిటరీ గ్రేడ్ సర్టిఫికేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 8000 ఎంఏహెచ్ బ్యాటరీతో మూడు రోజుల పాటు ఫోన్ వాడుకోవచ్చని కంపెనీ చెబుతోంది. 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో పాటు 27W రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది.

**ఇక ధర విషయానికొస్తే..**
ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.18,999గా నిర్ణయించారు. 6జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.20,999, 6జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.22,999గా కంపెనీ పేర్కొంది. కార్డు ఆఫర్‌తో రూ.2 వేలు డిస్కౌంట్ లభిస్తుంది. జూన్ 17 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. సిల్వర్ గ్లేర్, టైటానియం గ్లేర్, లావెండర్ గ్లేర్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఇండియా స్టోర్‌లో కొనుగోలు చేయొచ్చు.

## ఎయిర్‌టెల్ ప్రయారిటీ
# పోస్ట్‌పెయిడ్ ఇకపై ఫాస్ట్‌లేన్

ప్రముఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్ పెయిడ్ ప్లాన్‌ను ఫాస్ట్‌లేన్‌గా రీబ్రాండ్ చేసింది (వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో ఈ మేరకు మార్పులు తీసుకొచ్చింది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్ పేరు మాత్రమే మారిందని, సేవల్లో ఎలాంటి మార్పులూ ఉండబోవని కంపెనీ స్పష్టంచేసింది. ఇందుకు సంబంధించి ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల 5జీ స్లైసింగ్‌లో భాగంగా ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్‌ను ఎయిర్‌టెల్ తీసుకురాగా.. అది కాస్తా చర్చనీయాంశమైంది. నెట్ న్యూట్రాలిటీకి వ్యతిరేకమన్న వాదనలు వినిపించాయి. ఈ క్రమంలో పేరు మార్చడం ప్రాధాన్యం సంతరించుకుంది. “పోస్ట్‌పెయిడ్ లాంచ్ క్యాంపెయిన్ ముగిసింది. బ్రాండ్ పేరు మాత్రమే మారింది. 5జీ స్లైసింగ్ ప్లాన్‌లో, ప్రయోజనాల్లో ఎలాంటి మార్పులూ ఉండవు. పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల కోసం తీసుకొచ్చిన ఫాస్ట్‌లేన్ విధానం వల్ల ప్రీపెయిడ్ యూజర్లపై ఎలాంటి ప్రభావం ఉండబోదు” అని ఎయిర్‌టెల్ ప్రతినిధి తెలిపారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**పెండింగ్ కేసులపై వేగవంతమైన చర్యలు, రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదుకు కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపు**



కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కరీంనగర్, (సింగిడి):** జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజావాణి ద్వారా వచ్చిన అర్జీలను ప్రాధాన్యతతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సహాయ కమిషనర్ సువార్తతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 188 అర్జీలు అందగా, వాటిలో కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి కార్యాలయ అధికారులు పర్యవేక్షిస్తున్నందున, నిబంధనలకు అనుగుణంగా ప్రతి అర్జీని పరిశీ లించి పరిష్కారానికి కృషి చేయా లని కలెక్టర్ సూచించారు. అలాగే లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సంబంధించిన ఫిర్యాదులు, న్యాయస్థానాల్లో పెం డింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారా నికి శాఖల వారీగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు, వరదలు, విపత్తులు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సమర్థవంతమైన సహాయం అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# దశాబ్దం తర్వాత కటకటాల వెనుకకు ధూమ్ ఖాలీద్

**చనిపోయాడనుకున్న మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిని వల వేసి పట్టుకున్న, రూరల్ పోలీసులు: రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు మహ్మద్ అబ్దుల్ వాజిద్ అలియాస్ ఖాలీద్ అలియాస్ ధూమ్ ఖాలీద్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చనిపోయాడనే ప్రచారం మధ్య అతడు మహా రాష్ట్రలో పలు ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతూ నేర కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం కేసులో గతంలో అరెస్టైన ఖాలీద్, బెయిల్‌పై విడుదలైన తర్వాత పరారయ్యాడు. అనంతరం జరిగిన దాడిలో రెండు కాళ్లు కోల్పోయినా నేరప్రవృత్తిని విడిచిపెట్టకుండా నాగ్‌పూర్, నాందేడ్, చంద్రపూర్, బల్లార్షా ప్రాంతాల్లో ముఠాలను ఏర్పాటుచేసి చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు తదితర నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దర్గాల వద్ద భిక్షగాడి వేషంలో ఉంటూ తన కదలికలను గోప్యంగా కొనసాగించినట్లు తేలింది. ఖాలీద్‌పై కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఐదు, వన్‌టౌన్‌లో రెండు, టూటౌన్‌లో ఒక కేసుతో పాటు మహారాష్ట్రలోనూ పలు కేసులు నమోదయ్యాయి. అతడి నేరచరిత్రకు సంబంధించిన అనేక ఘటనలు అధికారిక ఫిర్యాదుల దశకు కూడా రాలేదని సమాచారం. ఇటీవల తన భార్యపై దాడి చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు అతడి కదలికలపై నిఘా పెట్టారు. కరీంనగర్ పరిసర ప్రాంతాలకు వచ్చినట్లు సమాచారం అందడంతో రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం సోమవారం అతడిని పట్టుకుంది. అత్యాచారం కేసులో కోర్టులో హాజరుపరచగా, మిగిలిన కేసుల్లోనూ తదుపరి చర్యలకు పోలీసులు సిద్ధమవుతు న్నారు. దశాబ్దకాలంగా తప్పించు కుంటూ వచ్చిన కరుడుగట్టిన నేరస్థుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి బృందాన్ని పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ అభినందించారు. ఈ అరెస్టుతో ప్రజల్లో ఊరట వ్యక్తమవుతుండగా, ఖాలీద్‌కు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

## కిసాన్‌నగర్‌లో సీసీ రహదారి పనులకు శంకుస్థాపన



**29వ డివిజన్‌లో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, (సింగిడి):** కిసాన్ నగర్ 29వ డివిజన్‌లో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. సుడా రెండేళ్ల ప్రగతి పక్షోత్సవాల సందర్భంగా స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అంతర్గత రహదారులు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను మొదటి ప్రాధాన్యంగా తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గత రెండేళ్లలో అనేక రహదారులను అభివృద్ధి చేశామని, భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, సహాయ ఇంజనీర్ సతీష్‌తో పాటు సోమిడి వేణు ప్రసాద్, కాంపెల్లి కీర్తి కుమార్, కుర్ర పోచయ్య, తోట అంజయ్య, మంద మహేష్, మేరాజ్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి..

**మంత్రిని కలిసిన సర్పంచ్ రాజవ్వ-రాజయ్య**



**బుగ్గారం,(సింగిడి):** ప్రభుత్వం కాళేశ్వరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య మంత్రిని కలిశారు. సాంఘిక సంక్షేమ మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం క్షేత్రం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనదని, సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు ఆధ్యాత్మిక చైతన్య కలిగించే మహోత్సవం అని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాలు ఇంకా ఎంతో ఘనంగా నిర్వహిస్తామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బుగ్గారం వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై అక్రమ కేసులు పెట్టొద్దు

**ధాన్యం కొనుగోలు అంశంపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ ఎమ్మెల్యే సత్యంకు మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ సవాల్**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం, వారిపైనే అక్రమ కేసులు నమోదు చేయించడం బాధాకరమని ఆయన అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో తనతో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే సత్యంకు సవాల్ విసిరిన రవి శంకర్, రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక రాత్రివేళల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం కంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్న రైతులను బెదిరించడం సరికాదని, రైతులపై కేసులు నమోదు చేయకుండా తనపై కేసు పెట్టాలని పోలీసులకు సూచించారు. అన్నారం దామోదర్ రెడ్డి, మహిపాల్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది రైతులపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. సంబంధంలేని కరుణాకర్‌పై కూడా తప్పుడు కేసు నమోదు చేసి 14 రోజుల పాటు జైలులో ఉంచారని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తో పాటు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నాపూర్‌లో ఉమ్మడి ఆస్తి తగాదాలు

**మాజీ హోమ్‌గార్డ్ జనార్దన్‌పై సోదరుడు నవీన్ కుమార్ ఫిర్యాదు**

**బుగ్గారం, (సింగిడి):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్‌కు చెందిన గజ్జెల నవీన్ కుమార్ తమ ఉమ్మడి కుటుంబ ఆస్తి పంపకం కోసం జిల్లా కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... తన తండ్రి కీర్తిశేషులు గజ్జెల లింగయ్యకు ముగ్గురు కుమారులున్నారు. పెద్దకుమారుడు నర్సయ్య, రెండో కుమారుడు జనార్దన్, మూడో కుమారుడు నవీన్ కుమార్. తండ్రి జీవించి ఉన్నప్పుడు సంపాదించిన ఉమ్మడి ఆస్తులను ఇప్పటివరకు పంచలేదని నవీన్ పేర్కొన్నారు. జనార్దన్ ఉమ్మడి ఆస్తిని తానే రిజిస్టర్ చేయించుకున్నాడని, ఆస్తి అడిగితే ఇవ్వకుండా ఇబ్బంధులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా చింతకుంటలో సర్వే నెం.439లో 12 గుంటల భూమి, జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా రెండంతస్తుల భవనం, చిన్నాపూర్‌లో నివాస గృహం, సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, 130తులాల వెండివస్తువులు, నగదురూ.5లక్షల, ఇతర అప్పు పత్రాలున్నాయని పిర్యాదులో పేర్కొన్నారు. ఆస్తి పంపకం అడిగినందుకు రెండో కుమారుడు జనార్దన్, ఆయన కుమారులు సాయితేజ, మణి తేజలు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇంటిపై దాడిచేశారని నవీన్ కుమార్ ఆరోపించారు. సస్పెండ్ అయిన హోంగార్డ్ జనార్దన్ పాత ఐడీకార్డుతో భయపెడుతున్నారని తెలిపారు. బాధితుడు నవీన్‌కుమార్ ఆస్తులను చట్టబద్ధంగా పంచేలా చర్యలు తీసుకోవాలని, బెదిరిం పులకు పాల్పడుతున్న జనార్దన్, ఆయన కుమారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# జమ్మికుంటలో పోలీసుల డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం... అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ రామకృష్ణ గౌడ్**





**జమ్మికుంట, (సింగిడి):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో పోలీసు అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం సహాయంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సామాన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా మాదక ద్రవ్యాల రవాణా జరిగే అవకాశాల నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. సీఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాల విక్రయం లేదా రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## బాలలకు ధ్యానం.. సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించిన పిరమిడ్ ధ్యాన సొసైటీ



**హుజురాబాద్,(సింగిడి):** హుజురాబాద్ పట్టణంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో పిరమిడ్ ధ్యాన సొసైటీ ఆధ్వర్యంలో బాలలకు ధ్యాన శిక్షణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పిరమిడ్ ధ్యాన సొసైటీ బోధకుడు చింత అనిల్ కుమార్ నాయకత్వం వహించగా, అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ధ్యాన కార్యక్రమాలను నిర్వహిస్తూ అనేక మందికి మానసిక, శారీరక ఉల్లాసాన్ని కల్పిస్తున్న చింత అనిల్ కుమార్ సేవలను అభినందిం చారు. బాల వికాసంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందని, ఇది పిల్లలలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించ డంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసా నికి దోహదపడుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే పిల్లలకు ధ్యానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి మంచి విలువలను పెంపొందించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అదేవిధంగా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడే నాట్య శిక్షణను అందిస్తున్న డాన్స్ మాస్టర్ చిదురాల రాజేష్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్యాస రవీందర్, కౌన్సిలర్ బొడ్డు మొగిలయ్య, సందేల వెంకన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి, వేల్పుల రత్నం, పోగు సమ్మయ్యతో పాటు పెద్ద సంఖ్యలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నృత్య పోటీల్లో విజయ పతకాల పంట

**ప్రసంగి డ్యాన్స్ స్టూడియో ఫిట్నెస్ సెంటర్ విద్యార్థుల ప్రతిభ సమ్మర్ క్యాంపు విద్యార్థులతో రాష్ట్రస్థాయిలో ప్రతిభ**



**జమ్మికుంట, (సింగిడి):** సమ్మర్ క్యాంప్ 40రోజుల విద్యార్థుల తోనే రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో మూడు విజయ పతకాలు ప్రసంగి డ్యాన్స్ స్టూడియో అండ్ ఫిట్నెస్ సెంటర్ సాధించింది. జమ్మికుంట లియాప్రసంగి, నాట్యప్రసంగి బృందాలకు ప్రథమ బహుమతులు, జూనియర్, బాయ్స్, తన్మయి గ్రూపులకు ద్వితీయ బహుమతులు సాధించారు. మే 30, 31 తేదీలలో కరీంనగర్‌లోని కళాభారతి ఆడిటోరియంలో సన్‌షైన్ కల్చరల్ అకాడమీ 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. కేవలం 40 రోజుల సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతోనే వరుసగా మూడు రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో విజయాలు సాధించడం ప్రసంగి డాన్స్ స్టూడియో ప్రత్యేకతగా నిలిచింది. ఈ విజయాలతో జమ్మికుంట పట్టణానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. పోటీలలో లియాప్రసంగి, నాట్యప్రసంగి నృత్య బృందాలు అద్భుత ప్రదర్శన కనబరిచి ప్రథమ బహుమతులు అందుకోగా, జూనియర్ గర్ల్స్ గ్రూప్, బాయ్స్ గ్రూప్ , తన్మయి గ్రూప్ ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. అదేవిధంగా అర్జున్ విశ్రుత్ రెడ్డి ప్రత్యేక నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కొరియోగ్రాఫర్ పాప్ చిక్ శ్రీధర్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ మేనేజర్ ప్రొప్రైటర్ ఎన్. శ్రీలత, డాన్స్ మాస్టర్లు ప్రసంగి, కే. రాజేష్ సిద్ధు విద్యార్థుల విజయాలపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరంశ్రీలత మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వేదికలపై అద్భుత ప్రతిభ కనబరిచి వరుస విజయాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని తెలిపారు.

## ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్‌పై

# అసత్య ప్రచారాలు

**ఖండించిన టీడీపీ నాయకులు**
**పార్టీ నేతలపై వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ఆరోపణలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం**
**కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి**




**కరీంనగర్,(సింగిడి):** టీడీపీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీఆర్, పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లపై ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలను తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు వంచ శ్రీనివాసరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి నాగుల బాలా గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా జరుగుతున్న తప్పుడు ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని వారు కోరారు. రాజకీయ విభేదాల పేరుతో నాయకుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు సమర్థనీయం కాదని పేర్కొన్నారు.

## అమ్మబాట.. అంగన్వాడి బాట



**బుగ్గారం,(సింగిడి):** బుగ్గారం మండలం శెఖల్ల గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రలో అమ్మ బాట అంగన్వాడి బాట అనే కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రంలో మూడు నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య, మానసిక అభివృద్ధి జరిగే విధంగా సహాయపడతాయని అంగన్వాడి ఉపాధ్యాయురాలు పేర్కొన్నారు. అదేవిధంగా ఐదు సంవత్సరాలలో పిల్లలకు బరువులు ఎత్తు తూచిక వారి యొక్క స్థితిగతులను తల్లిదండ్రులకు తెలియజేయడం ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు టీ హెచ్ ఆర్, కోడిగుడ్లు బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ ఉపసర్పంచ్ బుచ్చయ్య గ్రామపంచాయతీ సెక్రటరీ రజిత, మహిళా వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## అఖిల భారత మేయర్ల సమావేశాలకు

# కరీంనగర్ మేయర్‌కు ఆహ్వానం

**జూన్ 3, 4 తేదీల్లో ఋషికేశ్‌లో జరిగే 117వ సమావేశాల్లో గౌరవఅతిథిగా పాల్గొననున్న కోలగని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జూన్ 3,4 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత మేయర్ల మండలి (ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్) 117వ సమావేశాలకు కరీంనగర్ మేయర్ కోలగని శ్రీనివాస్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు సోమవారం ఋషికేశ్ నగర పాలక సంస్థ అధికారిక ఆహ్వాన పత్రాన్ని పంపింది. అఖిల భారత మేయర్ల మండలి అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో పాటు పలువురు మంత్రులు, రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు హాజరుకానున్నారు. మండలి కార్యదర్శి మనోజ్ గుప్తా, ఋషికేశ్ మేయర్ రణజయ్ పాన్వర్ ఆహ్వానం మేరకు మేయర్ కోలగని శ్రీనివాస్ ఈ సమావేశాల్లో పాల్గొనను న్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల మేయర్లు హాజరయ్యే ఈ సమావేశాల్లో పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజాసేవల మెరుగుదల, స్మార్ట్ నగరాల కార్యక్రమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

# ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

**వెయ్యిలోపు ఆరుగురు, 2వేలలోపు 11 మంది, 3వేలలోపు 19 మంది ర్యాంకులు సాధించిన విద్యార్థులు**

**అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**







**కరీంనగర్,(సింగిడి):** ఐఐటీ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి సంస్థకు మరింత గౌరవాన్ని తీసుకు వచ్చారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రకటించిన ఫలితాల్లో కె. ప్రజ్ఞాన్ దీపక్ 75వ ర్యాంకు సాధించగా, సి.హెచ్. లక్ష్మీహాసిని 400, ఎన్. రత్నప్రకాశ్ 497, బి. లిఖిత్ సాయి 785, ఎం. వశిష్ఠ 800, బి. స్పందన 954, కె. ధనుష్ 1294, ఎం. జోహన్ 1400, పటేల్ అక్షయ 1488, సి.హెచ్. అభిరామ్ రావు 1618, ఎ. సత్యవర్ధన్ 1678 ర్యాంకులు సాధించారు. మొత్తంగా వెయ్యిలోపు 6 మంది, రెండు వేలలోపు 11 మంది, మూడు వేలలోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. పటిష్టమైన విద్యా ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల మార్గదర్శకత్వం, విద్యార్థుల కృషి ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో తొలిసారిగా ఐఐటీ శిక్షణను అందించి, అనేక మంది విద్యార్థులను ప్రతిష్ఠాత్మక భారతీయ సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా తీర్చిదిద్దిన సంస్థగా అల్ఫోర్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతి ఏడాది ఐఐటీల్లో ప్రవేశాలు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. రానున్న నీట్ 2026 ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశిష్ట ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందిస్తూ, విజయానికి కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదింటి ఆడబిడ్డ చిరునవ్వే కళ్యాణ లక్ష్మి విజయానికి నిదర్శనం

**శాసనసభ్యులు కాలే యాదయ్య..**



**చేవెళ్ళ, (సింగిడి):** చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల మున్సి పాలిటీ పరిధికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కు లను స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య స్థానిక నాయకులతో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, చేవెళ్ల మండలం మున్సిపాలిటీకి చెందిన 38 మంది లబ్ధిదారులకు రూ.38,00,618 విలువ గల కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. పేద మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# లక్షలు దండుకున్నాడంటూ రెవెన్యూ అధికారిపై ఆరోపణలు

**రెవిన్యూ శాఖలో భారీ అవినీతి అధికారి..!**
**భూపట్టా విషయంలో లక్షలు కాజేసిన ఆర్ఐ !**
**బాధితులు ప్రజావాణిలో ఆర్డీవోకు ఫిర్యాదు**




**హుస్నాబాద్, (సింగిడి):** రైతుల సాదా బైనామాల భూములకు పట్టాలు ఇప్పిస్తానని లావణి భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించి రెవెన్యూ అధికారి రైతులు దగ్గర లక్షలు దండుకున్నాడని ఆరోపిస్తూ హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రామ్మూర్తికి ప్రజావాణిలో బాధితులు నీరుకొండ దేవయ్య బల్ల బాలరాజు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గోపాలపూర్ గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. సదరు అధికారి నీరుకొండ దేవయ్య నుంచి 18లక్షల 80 వేలు తీసుకున్నాడని, బల్ల బాలరాజు నుంచి నాలుగు లక్షల 80 వేల రూపాయలు తీసుకున్నాడని ఆరోపించారు. ఇంకా ఈ మండలంలో అనేకమంది బాధితుల నుండి లక్షల రూపాయలు ఆర్ ఐ రామా అఖిలేష్ వసూలు చేశాడని ఆరోపించారు. హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరిడేంట్ రామ అఖిలేష్ అనే అధికారి ఇంతకుముందు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలో ఆర్ఐగా పనిచేస్తుండేవాడు. అక్కడ రైతులతో మమేకమై భూ సమస్యలు పరిష్కరిస్తారంటూ సాదా బైనమాలను పరిష్కరించి పట్టాలు ఇప్పిస్తానని 2022 సంవత్సరం నుండి ఇప్పటివరకు సదరు అధికారి రైతుల దగ్గర లక్షల రూపాయలు దండుకొని భూకాయిస్తున్నాడని ఆరోపించారు. లావని పట్టా ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని నమ్మబలికాడని ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఎదుట బాధితులు వేడుకున్నారు. సదరు రెవెన్యూ అధికారిని భూ సమస్యలపై తీసుకున్న డబ్బుల విషయం గురించి అడిగితే నాకేం తెలవదు అని మాట దాటేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికీ 5 సంవత్సరాలు గడుస్తున్నా మా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని బాధితులు వాపోయారు. భూ సమస్యలు పరిష్కరిస్తానంటే మా భార్య పిల్లల పుస్తెలతాడు బంగారు కమ్మలు గొలుసులు అమ్మి సదరు అధికారికి నగదు ముట్ట చెప్పామని బోరున విలపించారు. ఈ అవినీతికి పాల్పడ్డ అధికారిని రెవెన్యూ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని అదేవిధంగా బాధితుల నుండి తీసుకున్న డబ్బులను వెంటనే రికవరీ చేసేలా కృషి చేయాలని కోరారు. లేనిచో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో , బాధితులు ఇంటి ముందు ధర్నా కార్యక్రమం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బాధితులు హెచ్చరించారు.

## క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వమే
# విజయానికి పునాది

కరీంనగర్‌లో రెసొనెన్స్ ఫౌండేషన్ కేంద్రం ప్రారంభం: మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ



**కరీంనగర్, (సింగిడి):** విద్యార్థుల విజయానికి క్రమశిక్షణతో పాటు సరైన మార్గదర్శకత్వం అత్యంత కీలకమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. కరీంనగర్‌లోని రేకుర్తి ప్రాంతంలో రెసొనెన్స్ విద్యాసంస్థల ఫౌండేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు బలమైన విద్యా పునాదిని నిర్మించుకోవాలని సూచించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉపయోగపడేలా ఫౌండేషన్ శిక్షణ అందుబాటులోకి తీసుకువస్తున్న రెసొనెన్స్ యాజమాన్యాన్ని అభినందించారు. రెసొనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నల్లా మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధన, నిరంతర విద్యా పర్యవేక్షణ ద్వారా ఫలితాల ఆధారిత విద్యను అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఈ కేంద్రం విద్యార్థుల్లో ప్రాథమిక అంశాలపై పట్టు పెంపొందించడంతో పాటు ఐఐటీ-జేఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యేలా దోహదపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో పోటీ పరీక్షల కోసం ప్రారంభ దశ నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధమవడం, అంశాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవడం, లక్ష్యాధారిత విద్యాభ్యాసం ప్రాముఖ్యతను వివరించారు. రెసొనెన్స్ విద్యాసంస్థలు 2001లో రాజస్థాన్‌లోని కోటాలో స్థాపించబడి, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 87 నగరాల్లో 150కిపైగా కేంద్రాల ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2018 నుంచి కార్యకలాపాలు ప్రారంభించిన ఈ సంస్థ, గత ఏడు సంవత్సరాల్లో వేలాది మంది విద్యార్థులను ఐఐటీలు, జాతీయ సాంకేతిక విద్యాసంస్థలు, త్రిపుల్ సాంకేతిక విద్యాసంస్థలు, ఎయిమ్స్ తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా తీర్చిదిద్దింది. ప్రస్తుతం ఫౌండేషన్ కేంద్రాలు, పాఠశాల విద్య, ఈ-అభ్యాసం, విదేశీ ఉన్నత విద్యా మార్గదర్శకత్వం వంటి రంగాల్లో విస్తరిస్తూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 50కి పైగా ప్రాంగణాలతో సేవలు అందిస్తోంది. అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..
# ప్రత్యేక వార్డు సభలకు శ్రీకారం

ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత చర్చ
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక వార్డు సభలు ఘనంగా ప్రారంభమయ్యా యి. జూన్ 4 నుంచి 10 వరకు నిర్వహించ నున్న ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు రేకుర్తి ప్రాంతంలో 14 నుంచి 25, 46, 47, 48 డివిజన్లకు సంబంధించిన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభలో ప్రజల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య విభాగాల పనితీరు, చేపడు తున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా సంబంధిత డివిజన్లలో 15 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న 5 కోట్ల రూపాయల పనులు, వర్షాకాల సన్నాహక చర్యలు, విద్యుత్ ఉపకేంద్ర అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. అలాగే 15 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 10 లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించి అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం భవన నిర్మాణ అనుమతులు, ప్రధాన ప్రణాళిక అమలు, అక్రమ నిర్మాణాల నియంత్రణ, రహదారి విస్తరణ, వర్షపు నీటి సంరక్షణ, 2027 జనగణన వంటి అంశాలపై వివరించగా, పారిశుధ్య విభాగం సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసే విధానంపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం హరితోత్సవంలో భాగంగా రేకుర్తి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. డివిజన్ల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు. నగర పరిశుభ్రత, చెత్త వర్గీకరణ, ఆరోగ్య కేంద్రాల వినియోగం, పెన్షన్ ధృవీకరణ ప్రక్రియ, శిథిల గృహాల తొలగింపు, పార్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డంప్‌యార్డు ప్రక్షాళన కోసం పట్టణ సవాల్ నిధి పథకం కింద 80 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ గృహ పథకం తొలి విడతలో 1,300 ఇళ్లను మంజూరు చేయగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పెన్షన్ ధృవీకరణ, జనగణన ప్రక్రియల్లో ప్రజలు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, 99 రోజుల ప్రగతి ప్రణాళికలో అనేక సమస్యలను పరిష్కరిస్తున్నా మని, ఇంకా ఉన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవి, పర్వతం మల్లేషం, గంట శ్రీనివాస్, వాసాల రమేష్, వరాల నర్సింగ్, ఒంటెల సత్యనారాయణ, కాంతాల జగన్ రెడ్డి, అదనపు కమిషనర్ ఆయాజ్, సువార్త, డిప్యూటీ కమిషనర్లు ఖాధర్ మొహియుద్దీన్, వేణు, పలు విభాల అధికారులు, డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్
బాధితులకు చెక్కుల పంపిణీ



**బుగ్గారం,(సింగిడి)::** అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం అని బుగ్గారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏడుగురు లబ్ధిదారులకు మంజూరైన నాలుగు లక్షల రూపాయల చెక్కులను గురువారం రోజు బుగ్గారం గ్రామపంచాయతీ ఆవరణ వద్ద సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉప సర్పంచ్ జంగా లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అక్బర్,వార్డు సభ్యులు పోగుల సమత తిరుపతి, పెద్దణవేని శంకర్,కోడిమ్యాల రాజన్న, తాడెపు లింగన్న, మసర్తి నర్సయ్య, నగునూరి వెంకన్న, పోగుల చిలుకయ్య,తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి మాస్టర్ శిక్షకుడిగా
# సిరాజ్ హుస్సేన్ నియామకం

బీఎల్ఏల శిక్షణలో నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వెల్లడి



**కరీంనగర్, (సింగిడి):** ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలకు సంబంధించిన బూత్ స్థాయి ప్రతినిధుల (బీఎల్ఏలు) శిక్షణ, సమన్వయ బాధ్యతల కోసం భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ శిక్షకుడిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సిరాజ్ హుస్సేన్‌ను పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా సిరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై బీఎల్ఏలకు సమగ్ర శిక్షణ అందించి వారి సామర్థ్యాలను పెంపొందించేం దుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతా మని చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని బీఎల్ఏల శిక్షణలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్న ఆయన, తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభలు

## మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్





**జమ్మికుంట, (సింగిడి)::** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్ర మంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపాలిటీలో వార్డు సభలను నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం గురువారం 12, 19, 20, 23, 24, 26 వార్డుల్లో సభలు నిర్వహించి ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మాట్లాడుతూ వార్డుల్లో ఉన్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడు తున్న చర్యలను ప్రజలకు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల అమలు, జల్ సంచయ్ - జల్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ఏర్పాటు, డ్రైన్ల పూడికతీత శుభ్రపరిచే పనులు, రుతుపవనాల సన్నద్ధత ప్రణాళికలు, తాగునీటి సరఫరా నిర్వహణ, నీటి నిల్వల నివారణ, పారిశుధ్య చర్యలు, రోడ్ల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు మరియు నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ముంతాజ్ అలీ (జావిద్), ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, భాస్కర్, పలువురు వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తరచూ దేవాలయాల్లో దొంగతనాలు: దంపతులు అరెస్ట్.




**మెట్‌పల్లి, (సింగిడి):** మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ పరిధిలోని పలు గ్రామాల దేవాలయాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్న ఘటనల్లో పోలీసులు కీలక దంపతులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా మెట్‌పల్లి మండలం వెలుల్ల గ్రామానికి చెందిన ఆరే శంకర్ (50) మరియు భార్య ఆరే అనూష (45) ప్రధాన నిందితులుగా గుర్తించబడి అరెస్ట్ అయ్యారు. గురువారం సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. పోలీసుల సమాచార ప్రకారం, నిందితులు బండలింగాపూర్, వర్షకొండ, తిమ్మాపూర్, వేములకుర్తి, ఆత్మకూరు, వేంపేట్, మల్లాపూర్, సిర్పూర్ రాఘవపేట్, ఊట్పల్లి గ్రామాల్లోని 8 దేవాలయాల్లో దొంగతనాలు చేశారు. వారి వద్ద 20 గ్రాముల బంగారం, 1.250 కిలోల వెండి స్వాధీనం తీసుకున్నారు.

పోలీసుల హెచ్చరిక..

దేవాలయాల్లో విలువైన వస్తువులను సురక్షితంగా భద్రపరచాలని, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకూ సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ ప్రత్యేక బృందంలో ఎస్సై కిరణ్ కుమార్, మల్లాపూర్ ఎస్సై అనిల్, ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్, ఐడి పార్టీ కానిస్టేబుల్స్ విశాల్, కిరణ్, ప్రణయ్ పాల్గొన్నారు.

# భగత్‌నగర్ వాసులకు సునీల్‌రావు భరోసా

బాధితులను పరామర్శించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్ ప్రాంతంలో, అంబేద్కర్ స్టేడియం వెనుక భారీ వర్షాల కారణంగా ఇళ్లలోకి వర్షపు నీరు చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఉప మేయర్, మాజీ మేయర్ శ్రీ యాదగిరి సునీల్‌రావు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధితుల ఇళ్లను సందర్శించిన ఆయన, ముంపు వల్ల ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముంపు సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీలో
# టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

సమస్యలు ఉంటే సమాచారం అందించండి
మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కమిషనర్ మల్లికార్జున స్వామి



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మున్సిపాలిటీ కార్యాలయం లోఅత్యవసర నియంత్రణ కేంద్రం (ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్) ఏర్పాటు చేసినట్లు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేం దుకు 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందని పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు టోల్ ఫ్రీ నంబర్: 8712037400 సంప్రదించవలసిన అధికారులు: ఏ. ఆకాశ్ ఉదయం 08:00 గంటల నుండి రాత్రి 08:00 గంటల వరకు బి. సాయి కుమార రాత్రి 08:00 గంటల నుండి ఉదయం 08:00 గంటల వరకు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు ఏదైనా సమస్యలు ఏర్పడితే వెంటనే సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల కారణంగా ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినట్లయితే పై నంబర్‌కు సంప్రదించి సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ గట్టు మల్లికార్జున స్వామి తెలిపారు.

# బడిబాటను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుపై అధికారులకు

అదనపు డా.అశ్విని తానాజీ వాకడే కలెక్టర్ ఆదేశాలు



**కరీంనగర్, (సింగిడి):** జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టి, పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలిక ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బడిబయట ఉన్న పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేం దుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలు, కాలనీలు, తండాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలికను మొదటి తరగతిలో చేర్పించడంతో పాటు, ఐదో తరగతి నుంచి ఆరో తరగతి, ఏడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి, పదో తరగతి అనంతర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పచ్చదనం, ఆకర్షణీయ వాతావరణంతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు సూచించారు. విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడడంతో పాటు పాఠశాల ఆవరణాలను రంగురంగులుగా తీర్చిదిదాలని తెలిపారు. బడిబాట కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రత్యేక బడిబాట గీతాన్ని రూపొందించాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గీత మాట్లాడుతూ, బడిబాట విజయవంతానికి గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేందుకు విద్యాశాఖతో సమన్వయంగా పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, సీడీపీవోలు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు కృషి చేసిన
# ట్రాఫిక్ సిబ్బందికి ప్రశంసలు

**సామాజిక బాధ్యతతో పనిచేసిన ఆర్ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని అభినందించిన సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్, (సింగిడి):** నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రమాదకరంగా మారిన రహదారి గుంతలను స్వయంగా పూడ్చి ప్రయాణికుల భద్రతకు కృషి చేసిన ట్రాఫిక్ ఆర్ఎస్ఐ ఎస్. శ్రీకాంత్‌తో పాటు ఆయన సిబ్బందిని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో వాహనదారుల రక్షణ కోసం ముందడుగు వేయడం ప్రశంసనీయమన్నారు. ప్రజల ప్రాణాల భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ విశేష సేవలు అందిస్తున్న కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.

# గ్లోబల్ సిటీగా కరీంనగర్ అభివృద్ధి

తెలంగాణకు గర్వకారణం
ఉత్తరాఖండ్‌లో జరిగిన అఖిల భారత మేయర్ల మండలి సమావేశంలో హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న మేయర్ కోలగాని శ్రీనివాస్




**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ వేగంగా గ్లోబల్ సిటీగా ఎదుగుతోందని, ఇది తెలంగాణకు గర్వకారణమని నగర మేయర్ కోలగని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లోని ఋషికేశ్‌లో జూన్ 3, 4 తేదీల్లో నిర్వహించిన అఖిల భారత మేయర్ల మండలి 117వ సమావేశంలో పాల్గొన్న ఆయన, నగరాభివృద్ధి, స్మార్ట్ సిటీ కార్యక్రమాలపై పూర్తిగా హిందీలో ప్రసంగించి ప్రశంసలు అందుకున్నారు. సమావేశంలో పాల్గొన్న పుష్కర్ సింగ్ ధామి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, మేయర్లు, అధికారులకు అభివాదం తెలిపిన అనంతరం కరీంనగర్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత కాదని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపికైన కరీంనగర్‌లో ఆధునిక రహదారులు, మెరుగైన పాదచారుల మార్గాలు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, నగరవ్యాప్తంగా నిఘా కెమెరాలు, సమీకృత నియంత్రణ కేంద్రం ద్వారా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదనంగా స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్య సదుపాయాలు, నాణ్యమైన రహదారులు, అందమైన ఉద్యానవనాల నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. చివరగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం తొలిసారిగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం పార్టీకి చారిత్రాత్మక విజయమని మేయర్ పేర్కొన్నారు. అనంతరం "జైహింద్, భారత్ మాతాకీ జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

# రామంతపూర్ తండా దగ్గర బస్సులు ఆపాలి

ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం
స్పందించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి





**వెల్దుర్తి, (సింగిడి)** మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ తండా వాసుల బస్సు సమస్యకు పరిష్కారం లభించింది. గురువారం తండా సర్పంచ్ చందర్ నాయక్, ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ సోనీ శ్రీనివాస్ నాయక్ నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని కలిశారు. బస్సు సౌకర్యం లేక తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మేడ్చల్ డిపో డీఎంతో చరవాణిలో మాట్లాడి, రామంతపూర్ తండా వద్ద 'రిక్వెస్ట్ బస్ స్టాప్' ఏర్పాటు చేయాలని సూచించారు. వెంటనే స్పందించిన మేడ్చల్ డీఎం, తండాకు వెళ్లే దారిలో రిక్వెస్ట్ బస్ స్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్ చందర్ నాయక్కు తెలిపారు. అంతేకాకుండా మేడ్చల్ డిపో డ్రైవర్లందరికీ వాట్సాప్ ద్వారా సందేశం పంపి, రామంతపూర్ తండా రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు తప్పనిసరిగా ఆపాలని ఆదేశించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చొరవతో తమ చిరకాల సమస్య తక్షణమే పరిష్కారమైనందుకు సర్పంచ్ చందర్ నాయక్, ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ సోనీ శ్రీనివాస్ నాయక్, తండావాసులు హర్షం వ్యక్తం , ధన్యవాదాలు తెలిపారు.

# బాధితులకు 'సీఎం సహాయనిధి' అండ

51 మంది లబ్ధిదారులకు 16.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
ఖమ్మం రూరల్, ఏదులాపురం వాసులకు
మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందజేత





**ఖమ్మం ప్రతినిధి, (సింగిడి):** వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 51 మంది లబ్ధిదారులకు రూ. 16,16,500 విలువైన చెక్కులను దయాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. లబ్ధిదారుల్లో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వారు 30 మంది, ఏదులాపురం మున్సిపా లిటీకి చెందిన వారు 21 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఆయా ప్రాంతా ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
7-7-2026

## మహిళ సంఘాల భవనాలు శరవేగంగా పూర్తి చేయాలి



**పాలేరు, (సింగిడి):** మహిళ సంఘాల భవనాలు శర వేగంగా పూర్తి చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం లో శుక్రవారం మహిళ సంఘం భవనం ను శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...మహిళల ను ఆర్థికంగా నిలిపేందుకు ప్రభత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కోన్నారు. నూతనంగా నిర్మించనున్న భవనాలు సమస్యల పరిష్కార వేదికలుగా నిలవాలని సూచించారు. మండలం లోని భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో బడి బాట ర్యాలీ లో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ దివ్యాంగ విద్యార్థి . భవిత కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, పీఆర్.ఏఈ ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె రహిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



**పాలేరు, (సింగిడి)** గుడిసె రహిత గ్రామాలను తయారు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని కోనాయిగూడెం లో ఇందిరమ్మ గృహ ప్రవేశం శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పదేళ్ల పాటు ఏ గ్రామంలో కూడ ఒక్క ఇల్లు ఇవ్వకపోవటంతో ప్రజలు సొంతిల్లు లేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇళ్ల ను శర వేగంగా నిర్మిస్తున్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంత్రి శ్రీనివాసరెడ్డి మంజూరు చేయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తెలిపే విధ్యుక్తంగా ప్రచారంచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాకాలపాటి కన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి రాజేష్, అనం వెంకటరెడ్డి, కొమ్మినేని విజయ్ బాబు, మండవ నాగర్జున, తోట చలపతి, సైదులు, చేరుకుపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ దినోత్సవ వేడుకలు..



**పాలేరు, (సింగిడి)** పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క ను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రుద్ర ప్రదీప్, జిల్లా ఉపాధ్యక్షుడు నకిరేకంటి వీరభద్రం, మండలాధ్యక్షుడు వాగ్గో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరపురం మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీలో మొక్క నాటే కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోత్తగూడెం పర్యావరణ ఇంజనీర్ రవీంద్ర, సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ వే ఎన్విరాన్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బౌద్ధ క్షేత్రం వద్ద మొక్కలు నాటారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, బుద్ధ విహార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బంతే సద్దా రక్షిత, కాసాని నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దుద్దల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తుర్రవారిగూడెంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

### మొక్కలు నాటి, అవగాహన ర్యాలీ నిర్వహించిన సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్తులు



**అశ్వాపురం, (సింగిడి)**
"ప్రకృతిని రక్షించుకోవడం మనందరి బాధ్యత" అనే సందేశంతో మండల పరిధిలోని తుర్రవారిగూడెం గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుంజ జాన్, ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని గ్రామంలో మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు.మొక్కలు నాటిన అనంతరం గ్రామస్తులు, యువకులు కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి, చెట్లను నరకరాదని నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశం అందించారు.కార్యక్రమం ముగింపులో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనూష, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందిస్తాం

**తహశీల్దార్ సూర్య ప్రకాష్**
**మీసేవ దరఖాస్తులకు ఫిజికల్ ఫారం అవసరం లేదు**
**మధ్యవర్తులను నమ్మొద్దు.. నేరుగా కార్యాలయాన్ని సంప్రదించండి**



**అశ్వాపురం, (సింగిడి)** ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అశ్వాపురం తహశీల్దార్ సూర్యప్రకాశ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయం చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం లేదని, అన్ని దరఖాస్తులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు ఆన్‌లైన్ విధానంలోనే పరిశీలించి అర్హులైన వారికి సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని తెలిపారు.మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత దరఖాస్తు ఫారాన్ని భౌతికంగా (ఫిజికల్‌గా) తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో సంబంధిత జీపీఓ (గ్రామ పంచాయతీ అధికారి) లాగిన్‌కు వెళ్లి, అక్కడ పరిశీలన అనంతరం ఆమోదం పొందుతుందని వివరించారు. అనంతరం అది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) లాగిన్‌కు చేరి, వారి పరిశీలన తర్వాత ఆదాయ ధ్రువీకరణ పత్రాలైతే డిప్యూటీ తహశీల్దార్‌కు, ఇతర సర్టిఫికెట్లైతే తహశీల్దార్ లాగిన్‌కు వెళ్తాయని చెప్పారు. తుది ఆమోదం అనంతరం డిజిటల్ సంతకం (డీఎస్) చేసి మీసేవ కేంద్రాల ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఎదుర్కొంటే మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేందుకు రెవెన్యూ శాఖ కట్టుబడి ఉందన్నారు.మీసేవ నిర్వాహకులు ప్రతి దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు అమలు చేస్తున్న కొత్త నిబంధనలపై మీసేవ నిర్వాహకులు కూడా అవగాహన పెంచుకొని, తమ సేవలను నవీకరించుకోవాలని కోరారు.మండలంలో ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి లైసెన్సు మంజూరు చేసిన అధికారిక మీసేవ కేంద్రాలు నాలుగు మాత్రమే ఉన్నాయని తెలిపారు. వాటిలో మొండికుంటలో కందిమళ్ల శ్రీధర్ రెడ్డి నిర్వహించిన మీసేవ కేంద్రం ఆయన మరణంతో ప్రస్తుతం పనిచేయడం లేదన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో రాజేందర్ నిర్వహిస్తున్న మీసేవ, రాంబాబు మెడికల్ షాప్ పక్కన పల్లవి నిర్వహిస్తున్న మీసేవ, ఎంఆర్వో రోడ్డులో నరసింహారావు నిర్వహిస్తున్న కల్హారి మీసేవ కేంద్రాలు మాత్రమే అధికారికంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు.కొన్ని ఆన్‌లైన్ కేంద్రాలు సిటిజన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ, వాటికి అధికారిక సర్టిఫికెట్ ప్రింటింగ్ సౌకర్యం ఉండదన్నారు. అనుమతి లేకుండా సిటిజన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు సర్టిఫికెట్ల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్దేశిత గడువులోపు విచారణ పూర్తిచేసి సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో నేరుగా తహశీల్దార్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, దరఖాస్తుల పరిష్కార విధానం, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, యూడీసీ, జీపీఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొండికుంటలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎంపీడీవో ముత్యాలరావు



**అశ్వాపురం, (సింగిడి)** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అశ్వాపురం మండలం మొండికుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన, పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు.గ్రామసభ అనంతరం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, చెట్లను సంరక్షించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ర్యాలీ ద్వారా ప్రజలకు సందేశం అందించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలోని డంపింగ్ షెడ్ వద్ద ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ముత్యాలరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, గ్రామాలను పచ్చదనంతో నింపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని ఆయన పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామస్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల్ల శివకుమార్, వార్డు సభ్యుడు గాదె మల్లిఖార్జున్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం సిబ్బంది, ఆశా వర్కర్లు, వీఓఏలు, రేషన్ డీలర్, గ్రామపంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బౌద్ధ క్షేత్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో హరితోత్సవం..



**పాలేరు (సింగిడి):**పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం ప్రకృతిని రక్షించుకోవడం అంటే మన,భవిష్యత్తును కాపాడుకోవడమేనని, విపత్కర వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రకృతి ఆధారిత పరిష్కారాలను అన్వేషించాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైందని ధమ్మ పద బుద్ధవిహార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బంతే సద్దా రాక్కిత పిలుపునిచ్చారు. గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక చారిత్రక బౌద్ధ క్షేత్ర ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా నిర్వహించిన హరిత వేడుకల్లో భాగంగా..ముఖ్య అధిదులుగా నేలకొండపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, బంతే సద్దా రాక్కిత పాల్గొని క్షేత్ర ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన ప్రకృతి నుండి ప్రేరణ.వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రకృతి మనకు నిజమైన మార్గదర్శి అని, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించేందుకు పర్యావరణ సమతుల్యత ఎంతో అవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రకృతి పరిరక్షణలో ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని, అయితే పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం వారి విధి మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ హరిత సంకల్పంలో గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు డి.రవికుమార్, 7వ వార్డు సభ్యులు యలమంద, కాసాని నాగేశ్వరరావు, బౌద్ధ ఉపాసకులు ఇదయ్య, కళ్యాణ్, క్షేత్ర వాచ్మెన్ స్టాలిన్, వర్కర్ సత్యవతి తదితరులు పాల్గొని, నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



**వెల్గటూర్, (సింగిడి)** ఉమ్మడి వెల్గటూర్ మండలం లోని కొత్తపేట గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరిగింది. గౌరెల్లి లక్ష్మణ్ రావు జ్ఞాపకార్థం కులస్తులు,సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ గత వారం రోజులుగా హోరాహోరీగా సాగింది.ఫైనల్లో విజేతగా నిలిచిన రమేష్ 11 టీమ్ విజేతగా నిలిచింది.విజేతలకు సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి,తహసీల్దార్ అనిల్ బహుమతులను అందజేశారు.యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాసిపెద్ది గోపాల రావు,కొక్కిరాల గోపాల్ రావు,కార్తీక్ రావు,ప్రశాంత్ రావు,ఉప సర్పంచ్ క్రాంతి కుమార్, క్రీడాకారులు,ప్రజలు,పాల్గొన్నారు.

## మనెవారి జలాల్పూరంలో పర్యావరణ దినోత్సవం

### మొక్కలు నాటిన వెల్దుర్తి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమ్యకృష్ణ



**వెల్దుర్తి,(సింగిడి)** వెల్దుర్తి మండలంలోని మనెవారి జలాల్పూర్ గ్రామంలో శుక్రవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 99 రోజుల ప్రణాళికలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.వెల్దుర్తి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రంగి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగి కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మన గ్రామంలో మొక్కలు నాటి ప్రతి ఒక్కరు నీరు పోసి పెద్దదిగా చేయాలి పెద్దగా పెరిగిన తర్వాత ఆక్సిజన్ మనకు స్వచ్ఛమైన గాలి ఆరోగ్యానికి కావలసినంత అంతేకాకుండా మన ఇంటి వారికి అందరికీ బాగుంటుందని సూచనలు ఇచ్చారు అనంతరం గ్రామంలో విచ్చలవిడిగా ఎలాంటి చెత్త చెదారం లేకుండా ఎవరికి వారం పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఇంటింటికి శుక్రవారం నుండి ఈ నెల 10వ తేదీ వరకు గ్రామంలోని ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పచ్చదనం పెంపొందితేనే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందుతుందని అన్నారు . 99 రోజుల ప్రణాళిక ద్వారా మండలంలోని అన్ని గ్రామాలను హరిత గ్రామాలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 7న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ రాక



**జమ్మికుంట, (సింగిడి)** హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో జూన్ 7 ఆదివారం, జరుగనున్న సామాజిక పరివర్తన సదస్సుకు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర రథసారథి ఇబ్రామ్ శేఖర్ ముఖ్య అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ విశిష్ట అతిథులుగా హాజరుకాను న్నారు.ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్ లో జరుగుతున్న క్యాడర్ క్యాంపు ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగును.టీ టిఫిన్ భోజన వసతి కూడా కలదని తెలిపారు.ఈ కార్యక్రమానికి హుజురాబాద్, కమలాపూర్,వీణవంక, ఇల్లంతకుంట,జమ్మికుంట. మండలాల నుండి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు,కార్యకర్తలు విద్యార్థులు ఉద్యోగ ఉపాధ్యాయులు, మేధావులు,యువకులు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి దొడ్డె సమ్మయ్య, సీనియర్ నాయకులు మారపల్లి మొగిలయ్య, అసెంబ్లీ ఇన్చార్జి వేల్పుల మల్లేష్,నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) సీనియర్ నాయకులు ఇదునూరి రమేష్,అసెంబ్లీ ఉపాధ్యక్షులు పెర్క శ్రీనివాస్,అసెంబ్లీ కార్యదర్శి గరిగె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభలు...

### పలు వార్డు లను సందర్శించిన మున్సిపల్ చైర్మన్..



**జమ్మికుంట, (సింగిడి)** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే వార్డు సభలు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సభల ద్వారా వార్డు ప్రజలు తమ సమస్యలను మున్సిపల్ పాలకవర్గానికి అలాగే అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమీషనర్ గట్టు మల్లికార్జున స్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 6,29,30 వార్డులలో డ్రైన్ పనులు చేతి పంపు రిపేర్ పనులు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కమీషనర్ మల్లికార్జున స్వామి తో కలిసి పరిశీలించారు. పట్టణ పరిధిలోని 6,29,30 వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృశ్య డ్రైన్ సమస్యలు ఉండకుండా పేరుకు పోయిన సిల్టు ను డ్రైన్ నుండి తీసుకున్న పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రస్తుతము ఉన్న ఎండాకాలం దృశ్య నీటి కొరతతో ఇబ్బంది పడుతున్నటువంటి పలు వార్డులలో చేతి పంపులు రిపేర్ పనులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్ మాచర్ల రాజు,శ్రీపతి నరేష్,బోళ్ళ సదానందం తదితరులు పాల్గొన్నారు..

## నా భర్త జంగిలి సాంబయ్య పై కావాలని అసత్య ఆరోపణలు

### మండల అధికారులకు వినతి పత్రం అందించిన గుండ్లోరి గూడెం సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య



**మునుగోడు, (సింగిడి)** నా భర్త జంగిలి సాంబయ్య పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండల అధికారులకు వినతి పత్రం అందించారు గుండ్లోరి గూడెం సర్పంచ్ జంగిలి సునీత , అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, ఈనెల రెండవ తారీకున తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుండ్లోరిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నా భర్త జంగిలి సాంబయ్య జాతీయ జెండా ఎగురవేశాడని, శుక్రవారం కొన్ని పత్రికల్లో ప్రచురించడం జరిగింది. దీని గురించి మీకు అక్కడ జరిగిన వాస్తవాలను తెలియ చేయుచున్నాను. దళిత బిడ్డ అయిన నా భర్తపై కొంత మంది అధికారి పార్టీ నాయకులు కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారు .గ్రామంలో జాతీయ పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా జాతీయ జెండాకు ఎల్లప్పుడూ గౌరవం ఇస్తూ నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతున్నది . జెండా ఎగురవేశాడని వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు. జెండా ఎగరవేసే సమయంలో గన్నేరు చెట్టు కొమ్మ అడ్డుగా రావడం వలన దాని తప్పించే క్రమంలో జరిగిన సంఘటనను వక్రీకరించటం జరిగింది.గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు కొందరు వ్యక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి నా భర్త జంగిలి సాంబయ్య గతంలో 5 సంవత్సరాలు ఉప సర్పంచ్ గా నిరంతరం సేవలందించిన విషయం మీ అందరికీ తెలిసినదే.నా భర్త సేవలను ఆదరించి జనరల మహిళ కోటాలో నన్ను సర్పంచ్ గా ఎన్నుకోవడం జరిగింది. దీని ఓర్వలేకనే కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పనిగట్టుకొని అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారు. దీని పట్ల నేను తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాను .ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెలుతు, గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్న మాపై అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు. అవసరం అనుకుంటే గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఈ విధంగా అభివృద్ధిని అడ్డుకోవద్దని కోరారు. దళిత బిడ్డలమైన మమ్ములను ఈ విధంగా ఇబ్బందులకు గురి చేయవద్దని సర్పంచ్ జంగిల్ సునీత సాంబయ్య తెలిపారు.

## గ్రామీణ క్రికెట్ ప్రతిభ అభివృద్ధికి అనురాగ్ యూనివర్సిటీ




**నల్గొండ ప్రతినిధి (సింగిడి)** టీజీ20 లీగ్‌లో నల్గొండ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అనురాగ్ నల్గొండ నైట్స్ జట్టు అధికారిక జెర్సీని శుక్రవారం నల్గొండలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన 25 నుంచి 30 క్రికెట్ అకాడమీలకు చెందిన 700 మందికి పైగా యువ క్రికెటర్లు, 60 మందికి పైగా కోచ్‌లు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనురాగ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ స్ట్రాటజీ అనురాగ్ పల్లా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు యూనివర్సిటీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులకు నాణ్యమైన కోచింగ్, ఆధునిక శిక్షణా సదుపాయాలు, ప్రాక్టీస్ మ్యాచ్‌లు, టాలెంట్ ఐడెంటిఫికేషన్ అవకాశాలను కల్పించి వారి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు.అనురాగ్ నల్గొండ నైట్స్ హెడ్ కోచ్ డి.బి. రవితేజ యువ క్రికెటర్లతో ప్రత్యేకంగా మమేకమై ఫిట్‌నెస్, నైపుణ్యాల అభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ఆటలో నిరంతర మెరుగుదల వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ యువ ఆటగాళ్లను ప్రోత్సహించారు.

## కోదాడ పెద్దచెరువు మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక



**కోదాడ,(సింగిడి)** కోదాడ పెద్దచెరువు మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఇందిరా ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా శీలం నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా వేముల గోపి, కార్యదర్శిగా ఐతనబోయిన వెంకన్న, కోశాధికారిగా శీలం లక్ష్మయ్య ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు శీలం నాగేంద్రబాబు మాట్లా డుతూ, తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, సం ఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తామని చెప్పారు. పెద్దచెరువులో చేపల ఉత్పత్తి పెంపు, సభ్యులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సంఘ సభ్యుల సహకారంతో మత్స్య సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన అన్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 7-7-2026

## ఘనంగా పి.వి జయంతి వేడుకలు




**భీమదేవరపల్లి, (సింగిడి):** భారతదేశ మాజీ ప్రధానమంత్రి, పీవీ నరసింహారావు'భారతరత్న' పి. వి. నరసింహారావు 105వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమ కొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర లో ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి, దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ఖాజీపేట ఎసిపి ప్రశాంత్ రెడ్డి పీవీ కుటుంబ సభ్యులు పీవీ మదన్ మోహన్ హాజరై నివాళులర్పించారు. అలాగే సీఐ పులి రమేష్, ఎస్ఐ దివ్యతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. రాజకీయ, ప్రజాప్రతినిధులలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి. రాజిరెడ్డి, ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల శ్రావంతి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య, జిల్లా కార్యదర్శి ఆదరి రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిదురాల స్వరూప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, "తెలుగు జాతి గర్వకారణం, భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అయిన భారతరత్న పి. వి. నరసింహారావు ఆశయాలు చిరస్మరణీయం. ఆయన చూపిన బాటలో నడవడం మనందరి బాధ్యత" అని కొనియాడారు. దేశ రాజకీయ, ఆర్థిక రంగాల్లో పి. వి. నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు.

## –పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం
### –అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ కోరారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సందర్శించి 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలించాలంటే ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పోలియో చుక్కలు సురక్షితమైనవని, పిల్లలభవిష్యత్తును ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఇవి కీలక పాత్ర పోషిస్తాయనితెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలువేయించకుండా మిగిలిపోకుండా ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలుచేపట్టాలని సూచించారు. బూత్‌లకు రాలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీవెళ్లి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు సమీప పోలియోకేంద్రానికి తమ చిన్నారులను తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత వనపర్తి జిల్లా లక్ష్య సాధనకు ప్రజలందరూ ఆరోగ్య శాఖకుసహకరించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారంలో పల్స్ పోలియో ప్రారంబించిన ఇంచార్జీ సర్పంచ్



**భీమదేవరపల్లి, (సింగిడి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హారికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 0--5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. "రెండు చుక్కలు -- పోలియోకు పూర్తి రక్షణ" అనే నినాదంతో ప్రతి చిన్నారిని సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఏఎన్ఎం వనజ, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశా కార్యకర్త రేణికుంట్ల భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## –మాజీ మున్సిపల్ చైర్మన్ సతీమణి మృతిపట్ల మాజీ మంత్రి సంతాపం



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్‌డాక్టర్ అశ్విని దామోదర్ సతీమణి అశ్విని జయమ్మ మృతి పట్ల ఆదివారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి కుమారుడు డాక్టర్ అశ్విని అమరేశ్వర్ ను ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యంగాఉండాలని కోరారు. కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ఆయన ఆకాంక్షించారు.

## పల్స్ పోలియో ప్రారంభించిన సర్పంచ్ బోయిన వేణు.



**పాలేరు (సింగిడి):** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమనికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బోయిన వేణు హాజరై ప్రారంభిం చారు... 5 సంవత్స రాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో వార్డు నెంబర్లు కాలింగి వీరబాబు లక్క నాగరాజు మేకలబ్రహ్మాం తీగ హనుమంతు దేగల సౌజన్య వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టారు.

## పల్స్ పోలియో లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులెవరూ తమ చిన్నారులను ఈ కార్యక్రమానికి దూరం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, లేదా పోలియో బూత్‌లకు తీసుక వచ్చి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్స్ గేరుగంటి లక్ష్మి నారాయణ, కో ఆప్షన్ మెంబర్ ముబాషీర్ అలీ, ఏఈ వేణు ప్రసాద్, ఎమ్మార్వో బిందు, డి. ఎం. హెచ్. ఓ వెంకట్, చలపతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి: కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కామారెడ్డిలోని 14వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత, 5 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని ఆదివారం కోరారు. ఎన్జీవోస్ కాలనీ పరిధిలోని అభ్యాస స్కూల్, 16 ఫోర్షన్ స్ట్రీట్ లో జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, రెండు చుక్కలు భవిష్యత్తులో అంగవైకల్యాన్ని నివారిస్తాయని ఆమె పిలుపునిచ్చారు.

## లక్ష్మి నరసింహ స్వామి కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక....
### నూతన అధ్యక్షులు గా జె. సుధాకర్...ప్రధాన కార్యదర్శిగా అఖిల్



**మల్కాజిగిరి, (సింగిడి):** కాలనీ అభివృద్ధితో పాటు, మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని నూతన అధ్యక్షులు జె సుధాకర్ అన్నారు. ఆదివారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ అసోసియేషన్ కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా జె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా, ట్రెజరర్ గా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బండ కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ చారి, సహాయ కార్యదర్శులుగా మునీర్, మల్లేష్, రవి నాయక్, అడ్వైజర్లుగా బరత్ సాగర్, రాజయ్య, కనకయ్య, పరమేష్, కమిటీ సభ్యులుగా సురేష్ సాగర్, కూర అరుణ్, మాదేశ్, సమల కృష్ణ, రాజేష్, ప్రసాద్, శ్రవణ్, దామోదర్, శ్రీధర్, రాంచందర్, సంతోష్, శ్రీనివాసులు, హరి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ద్యాప గోపాల్ రెడ్డి సేవలు మరువలేనివి
### శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి మండల ప్రజా పరిషత్ ఆవరణలో నిర్వహించిన మాజీ శాసన సభ్యులు, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు, మాజీ డీసీసీ చైర్మన్ స్వర్గీయ గుడిగానిపల్లి ధ్యాప గోపాల్ రెడ్డి శత జయంతి ఉత్సవాలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్కి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ గోపాల్ రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం ఆయన ప్రజా సేవలు, రాజకీయ ప్రస్థానం, కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి చేసిన విశేష కృషిని స్మరించు కుంటూ, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపో యిన గొప్ప నాయకుడిగా కొనియాడారు, వారి ఆశయాలు, విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు, అలాగే శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వందేమాతరం ఫౌండేషన్ మరియు గోపాల్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ పోటీలకు కూడా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు, పోటీల్లో పాల్గొన్న యువతను అభినందిస్తూ, పాల్గొన్న వారం దరికీ అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాండ్ర సాయిరెడ్డి , స్వర్గీయ ద్యాప గోపాల్ రెడ్డి ట్రస్ట్ సబ్యులు గోలి ప్రభాకర్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అంధ్యక్షులు నర్సిరెడ్డి, శృతిలయ కల్చరర్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, కార్యక్రమ నిర్వాహక సబ్యులు సందీప్ తో పాటు ప్రశాంత్ రెడ్డి అభిమానులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం



**భిక్కనూర్, (సింగిడి):** మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో నివారణ కోసం పోలియో చుక్కలు వేయించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ప్రత్యేక బూత్‌లలో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. కార్యక్రమాన్ని వైద్యాధికారులు పర్యవేక్షిస్తూ, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు, లింబాద్రి, దయాకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, గజ్జె వేణు, మమత వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి : చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు, (సింగిడి)::** చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గతంలో పోలియో మహమ్మారి కారణంగా అనేక మంది చిన్నారులు అంగవైకల్యానికి గురయ్యారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగలకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. మొదటి రోజు కేంద్రాలకు రాలేని చిన్నారుల కోసం సోమవారం, మంగళవారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, సౌజన్య దిలీప్ రెడ్డి, హరి శంకర్ నాయుడు, మన్యం, వైద్యాధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో



**భీమదేవరపల్లి, (సింగిడి):** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీహెచ్‌సీ వంగర మరియు ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో బూత్ డే విజయవంతంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఆరోగ్య శాఖ కీలక అడుగు వేసింది. పీహెచ్‌సీ వంగర పరిధిలో 23 పల్స్ పోలియో బూత్‌లు, ఒక మొబైల్ టీమ్ ద్వారా మొత్తం 2,315 మంది లక్ష్య చిన్నారుల్లో 2,180 మందికి పోలియో చుక్కలు వేశారు. అలాగే ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1,885 మంది లక్ష్య చిన్నారుల్లో 1,875 మందికి పోలియో డ్రాప్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డా. రహ్మాన్, డా. దినేష్, పీహెచ్ఎన్ వాణి, హెచ్ఈఓ మోహన్, గ్రామ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రహ్మాన్ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. బూత్‌లకు రాలేకపోయిన చిన్నారుల కోసం వచ్చే రెండు రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేస్తామని, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఆరోగ్య శాఖకు సహకరించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అధికారులు పునరుద్ఘాటించారు.



## పోలియో చుక్కలు విజయవంతం

**వెల్దుర్తి (సింగిడి):** మాసాయిపేట మండలం కేంద్రంలోని మాసాయిపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి తో కలిసి పోలియో చుక్క పంపిణీ కార్యక్రమం చేశారు మండల కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు అదేవిధంగా స్టేషన్ మాసాయిపేట గ్రామ సర్పంచ్ స్టేషన్ శ్రీను ఆధ్వర్యంలో పోలియో చుక్కలు చిన్న పిల్లలకు కార్యక్రమం చేశారు అనంతరం కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తో మాజీ ఎంపిటిసి, పాలకవర్గం గ్రామ ప్రజలు పాల్గొన్నారు అనంతరం చిన్న పిల్లలు ఆరోగ్యం బాగుండాలంటే పోలియో చుక్కలు వేయించాలని సూచనలు తెలిపారు .



## పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దాం
### మునిసిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్



**అమరచింత, (సింగిడి):** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అమరచింత మున్సిపల్ చైర్పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ పిలుపునిచ్చారు. వలస పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమరచింత తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు మున్సిపల్ చైర్ పర్సన్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం చైర్పర్సన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జింక రవి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, వైద్య బృందం పాల్గొన్నారు.

### తాగునీటి గోస తీర్చిన పిఎసిఎస్ చైర్మన్

**అమరచింత, (సింగిడి):** తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారురేచింతల సింగిల్విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి. వీరరాఘవపురంలోతాగునీటి గోస తీరుస్తానని ఇచ్చిన హామీ ప్రకారం ఆదివారం గ్రామంలోనిసుంకులమ్మ దేవాలయం వద్ద లక్ష రూపాయల వ్యయంతో తాగునీటి బోరును వేయించారు. బోరులో నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. తమ గ్రామానికి తాగునీటికి దోశ తీర్చినపిఎస్సి చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డికి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామ సర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లలకు పోలియో చుక్కలు వేద్దాం.. వారి ఆరోగ్యాన్ని కాపాడుదాం
### –మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** పిల్లలకు పోలియో చుక్కలు వేయించివారి ఆరోగ్యాన్ని కాపాడుదామని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆదివారం పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేయడం వల్ల వారి ఆరోగ్యాన్నిరక్షించడంతోపాటు పోలియో రహిత గ్రామంగా తీర్చిదిద్దిన వారం అవుతామనిచెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు గ్రామస్తులు రాములు, రామిరెడ్డి, ప్రతాపరెడ్డి, బాలరాజు, కొములయ్య, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, శేషయ్య యాదవ్, బుచ్చయ్య, రాఘవేంద్ర, శివకుమార్, ఉషయ్య తదితరులుపాల్గొన్నారు



## పెబ్బేరులో ఆర్ఎస్ఎస్ హిందూ సామ్రాజ్య దినోత్సవం
### యువ సాంఘిక్ కార్యక్రమం



**పెబ్బేరు, (సింగిడి):** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం, యువ సాంఘిక్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు, యువకులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో సంఘ్ సంప్రదాయ పద్ధతిలో స్వయంసేవకులు శారీరక విన్యాసాలు, దండ ప్రదర్శనలు, వ్యాయామ విన్యాసాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. యువతలో క్రమశిక్షణ, సేవా భావం, దేశభక్తిని పెంపొందించే విధంగా కార్యక్రమం సాగింది. అనంతరం నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య దినోత్సవం చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ అభ్యున్నతి కోసం యువత సేవా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, జాతీయ చైతన్యం, సామాజిక బాధ్యత పెంపొందించడంలో యువత ముందుండాలని వక్తలు సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా, మండల స్థాయి బాధ్యులు, స్వయంసేవకులు, యువకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం శాంతియుత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

singidinews@gmail.com

# ఇరుముడితో బిజీ.. అయినా కొత్త సినిమాపై దృష్టి

### శ్రీవిష్ణుతో కలసి మల్టీస్టారర్ కోసం రవితేజ యత్నం



మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులను ఈ పాట బాగా ఆకట్టుకుంది. జి. వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సిన్మా సింగిడి Cinma Singidi

మంగళవారం
7-7-2026

# నాగార్జున వందో సినిమాలో టబూ

టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం . ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.



Tabu



# నిర్మాతగా ప్రదీప్ రంగనాథ్ కొత్త అవతారం

వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథ్ ఇప్పుడు నిర్మాతగా అవతారం ఎత్తబోతున్నారు. లవ్ టుడే, డ్రాగన్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఆయన, ఇటీవల విడుదలైన సినిమాతో మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ సినిమా నిరాశపరిచినప్పటికీ ప్రదీప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నటుడు, దర్శకుడు, కథా రచయిత, గేయ రచయితగా తన ప్రతిభను చాటుకున్న ప్రదీప్ రంగనాథన్.. ఇప్పుడు నిర్మాతగానూ అడుగు పెడుతున్నారు. తాజాగా పీఆర్ షో అనే సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆయన, ఆ బ్యానర్‌పై తొలి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో 'ప్రేమలు', 'డ్యూడ్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. దర్శకుడిగా పేరు తెచ్చుకుని, ప్రస్తుతం నటుడిగానూ రాణిస్తున్న అశ్వత్ మారిముత్తు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాతో అనామిక మహి వెండితెరకు పరిచయం కానుండగా, తెలుగు నటుడు శివాజీ సొంటినేని, నటి స్వాసిక ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ 'ది ఆల్ఫా యూనిట్'. ఆరుగురు యువ దర్శకులతో ఫిల్మ్‌మేకింగ్ చేయడం. విశాల్ టీఆర్, యశ్ వి, నరేన్ సౌదా, చాణక్యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించనున్నారు. ఈ వినూత్న ప్రయత్నం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి కథను స్వయంగా ప్రదీప్ రంగనాథన్ అందించగా, యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం సమకూరుస్తున్నారు. సినిమా ప్రకటన సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో నటీనటులు, సాంకేతిక బృందాన్ని పరిచయం చేస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారు. నిర్మాతగా ప్రదీప్ రంగనాథన్ ప్రారంభిస్తున్న ఈ కొత్త ప్రయాణం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్

ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

# 10న విడుదలవుతున్న లెనిన్

## ఓటిటి హక్కులు దక్కించుకున్న జీ

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ఎ÷-లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.




Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737